

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499


No: KNL/3`78(D)/2026`2028

Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ | సంపుటి -14 | సంచిక - 227 | పేజీలు - 08 | వెల - 05/- | గురువారం 13-08-2026


## బాలికలకు శక్తి టీం రక్షణ..





# 21,627 మందికి ఉద్యోగాలు

## పరిశ్రమలకు సీఎం చంద్రబాబు ప్రోత్సాహం

- చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐపీబీ సమావేశం
- పారిశ్రామిక రంగానికి అందిస్తున్న ప్రోత్సాహకాల చెల్లింపు విధానంలో కీలక మార్పు
- ఈ విధానం ద్వారా పారదర్శకతను పెంచడమే లక్ష్యం
- నిధుల వినియోగాన్ని సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చన్న సీఎం

*డిసెంబరు నుంచి పరిశ్రమలకు అందించే అన్ని రకాల ప్రోత్సాహకాలను ప్రత్యేక ఎస్క్రో ఖాతాల్లో నేరుగా జమ చేసేలా చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ విధానం ద్వారా ఇన్సెంటివ్‌ల చెల్లింపుల్లో పారదర్శకత పెరగడంతో పాటు, నిధుల వినియోగాన్ని సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చని తెలిపారు.*



రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి అందిస్తున్న ప్రోత్సాహకాల చెల్లింపు విధానంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలకమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది డిసెంబరు నుంచి పరిశ్రమలకు ఇచ్చే అన్ని రకాల ప్రోత్సాహకాలను (ఇన్సెంటివ్స్) నేరుగా ప్రత్యేక ఎస్క్రో ఖాతాల్లో జమ చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ విధానం ద్వారా పారదర్శకతను పెంచడంతో పాటు, నిధుల వినియోగాన్ని మరింత సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. పారిశ్రామిక ప్రగతికి ప్రోత్సాహకాలు తప్పనిసరి అని, అయితే వాటిని ఎంతవరకు ఇవ్వగలమనే అంశంపై స్పష్టమైన ప్రణాళిక ఉండాలని సీఎం సూచించారు. బుధవారం (ఆగస్టు 12) నాడు సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 20వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశం జరిగింది. ఈ భేటీలో పరిశ్రమలు, ఇంధనం, ఐటీ ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు సంబంధించి మొత్తం 25 ప్రాజెక్టులకు బోర్డు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి రూ.2,08,406 కోట్ల విలువైన పెట్టుబడులు రానుండగా, తద్వారా ప్రత్యక్షంగా 21,627 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఇప్పటివరకు జరిగిన 20 ఎస్ఐపీబీ

మిగతా 2లో

# విద్యార్థుల పై బలప్రయోగం

## అంశం ఝార్ఖండ్ ప్రభుత్వాన్ని సమర్థించిన కాంగ్రెస్

- ఝార్ఖండ్ విద్యార్థుల ఆందోళనల విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతు
- నిరసనకారులపై ఎలాంటి బలప్రయోగం జరగలేదని స్పష్టీకరణ
- ఎగ్జామ్ మాఫియాను కాపాడేందుకే బీజేపీ సీబీఐ విచారణ కోరుతోందని ఆరోపణ
- బీజేపీ హయాంలో దేశవ్యాప్తంగా 152 పేపర్ లీక్‌లు జరిగాయన్న కాంగ్రెస్



ఝార్ఖండ్‌లో ఉద్యోగ నియామక పరీక్షల్లో అవకతవకలపై విద్యార్థులు చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంకీర్ణ ప్రభుత్వానికి పూర్తి మద్దతు ప్రకటించింది. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై ఎటువంటి బలప్రయోగం జరగలేదని ఈ సందర్భంగా పార్టీ స్పష్టం చేసింది. ఈ అంశాన్ని పక్కదారి పట్టించేందుకు బీజేపీ

మిగతాది 2లో

# రాహుల్ గాంధీ పై బీజేపీ

## ఎంపీ నిశికాంత్ దూబే తీవ్ర విమర్శలు

- రాహుల్ రూపంలో జిన్నా పునర్జన్మించారంటూ వివాదాస్పద వ్యాఖ్య
- జార్ఖండ్ ఉద్యోగ నియామకాల్లో అవకతవకలపై సీబీఐ విచారణకు డిమాండ్
- హేమంత్ సోరెన్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్‌కు సవాల్



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

మిగతాది 2లో

# హెచ్ఐవీ నియంత్రణకు 60 రోజుల ప్రత్యేక ప్రచారం

- ఎయిడ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ధ్యేయం
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ పిలుపు
- 60 రోజుల ప్రత్యేక అవగాహన ప్రచారాన్ని ప్రారంభించిన మంత్రి
- డిజిటల్ పర్యవేక్షణకు 'సురక్ష' డ్యాష్‌బోర్డ్ ఆవిష్కరణ



హెచ్ఐవీ, ఎయిడ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, 2026 డిసెంబరు 1 నాటికి నిర్దేశిత '95-95-99' లక్ష్యాలను వంద శాతం సాధించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ సాధనలో యువతతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఏపీ శాక్స్) ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన '60 రోజుల ప్రత్యేక సమాచార,

మిగతాది 2లో

# 'లుంగీవాలా' వ్యాఖ్యలపై రాజ్యసభలో రగడ..

- వ్యాఖ్య తన సంస్కృతిని అవమానించిందని బ్రిటాస్ ఆరోపణ
- సంయమనం పాటించాలని చైర్మన్ సభ్యులకు సూచన
- సంస్కృతి, గుర్తింపు, మతాన్ని అగౌరవపరచకూడదని హితవు
- అందరూ భారతీయులేనని కిరణ్ రిజిజు వ్యాఖ్య



'లుంగీవాలా' వ్యాఖ్యపై రాజ్యసభలో బుధవారం తీవ్రగందరగోళం నెలకొంది. సీపీఎం సభ్యుడు జాన్ బ్రిటాస్ తనపై ఓ మహిళా సభ్యురాలు అనుచిత వ్యాఖ్య చేశారని సభ దృష్టికి తీసుకురావడంతో

మిగతాది 2లో

# అమెరికాలో అదానీ పై కేసు కొట్టివేత..

## మోదీపై రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు



2లో



2

# జెన్-జీకి ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచన

- జీవితంలో షార్ట్‌కట్‌లు ప్రమాదకరమన్న ప్రధాని నరేంద్ర మోదీ
- సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని సూచన
- గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు చదవాలంటూ యువతకు హితవు

మాజీ రాష్ట్రపతి కోవింద్ ఆత్మకథ ఆవిష్కరణ సభలో వ్యాఖ్యలు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేటి తరం యువతకు (జెన్-జీ) పలు కీలక సూచనలు చేశారు. జీవితంలో అడ్డదారుల వెంట పడొద్దని, అవి అంతిమంగా తీవ్ర నష్టాలకే దారితీస్తాయని ఆయన హెచ్చరించారు. అదే సమయంలో, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుధవారం నాడు ఢిల్లీలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

# మేం 'టీ-హబ్' కడితే..

## రేవంత్ 'అనుముల హబ్' కడుతున్నారు: కేటీఆర్

- సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడిపై కేటీఆర్ విమర్శల దాడి
- మేం టీ-హబ్ కడితే.. రేవంత్ 'అనుముల హబ్స్' తెస్తున్నారని ఎద్దేవా
- సీఎం సోదరుడి సంస్థకు రూ. 200 కోట్ల విలువైన భూమి కట్టబెట్టారని ఆరోపణ
- లక్ష మూలధనం ఉన్న కంపెనీకి భూ కేటాయింపులపై సమగ్ర విచారణకు డిమాండ్
- ఈ వ్యవహారంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని, కోర్టును ఆశ్రయిస్తామని వెల్లడి



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడు అనుముల కొండల్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తన విమర్శల దాడిని మరింత ఉద్ధృతం చేశారు.

మిగతాది 2లో



2లో

# చంద్రబాబు ఒక విజనరీ లీడర్!

- నిజమైన అభివృద్ధికి చంద్రబాబు చిరునామా అన్న ద్రౌపది ముర్ము
- ఏపీ అభివృద్ధికి చంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశంస

# గోదావరి జలాల వినియోగంపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

- గోదావరి నదీ జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయం
- ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి నీటిని లిఫ్ట్ చేయాలని సీఎం ఆదేశం
- కాళేశ్వరం బ్యారేజీల భద్రతపై ఎన్డీఎస్ఏ సూచనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం
- భూ నిర్వాసితులకు పరిహారం వెంటనే చెల్లించేందుకు కార్యాచరణకు ఆదేశం



గోదావరి నదీ జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా నీటి ఎత్తిపోతల (లిఫ్ట్) ప్రక్రియను ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నీటిపారుదల శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సిఫార్సుల మేరకు ప్రస్తుతం సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలలో నీటిని నిల్వ చేయడం లేదని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఎన్డీఎస్ఏ మార్గదర్శకాలను అధికారులు కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.



మిగతా 2లో

# విద్యార్థులపై బలప్రయోగం అంశం: ఝార్ఖండ్ ప్రభుత్వాన్ని సమర్థించిన కాంగ్రెస్

*(మొదటి పేజీ తరువాయి)*

ప్రయత్నిస్తోందని, 'ఎగ్జామ్ మాఫియా'ను రక్షించేందుకే ఇదంతా చేస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. బుధవారం నాడు కాంగ్రెస్ మంత్రులు విలేకరులతో మాట్లాడుతూ, నిరసనలు తీవ్రరూపం దాల్చకముందే పేపర్ లీకేజీలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుందని వెల్లడించారు. రాష్ట్ర సీఐడీ విచారణకు బదులుగా సీబీఐ దర్యాప్తును బీజేపీ డిమాండ్ చేయడం వెనుక ఎగ్జామ్ మాఫియాను రక్షించాలనే దురుద్దేశం ఉందని వారు మండిపడ్డారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు బీజేపీ ప్రభుత్వం యువత గొంతు నొక్కిందని వారు విమర్శించారు. 2015 నుంచి దేశవ్యాప్తంగా బీజేపీ పాలనలో 152 పేపర్ లీకేజీలు జరిగితే, సీబీఐ కేవలం 17 కేసులనే మాత్రమే విచారించిందని, వాటిలో ఒక్క కేసులోనూ శిక్షలు పడలేదని కాంగ్రెస్ గణాంకాలను ఉదహరించింది. కేంద్రం ఒత్తిడితోనే ఝార్ఖండ్ బీజేపీ నేతలు వ్యవహరిస్తున్నారని,

ఆగస్టు 10న శాంతియుతంగా సాగుతున్న నిరసనలను పక్కదారి పట్టించేందుకు బయటి వ్యక్తులను రంగంలోకి దించారని ఆరోపించింది. మరోవైపు, జేఎస్ఎస్సీ-సీజీఎల్ పరీక్షను రద్దు చేయాలని, జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ నియామకాల్లోని అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించాలని కోరుతూ విద్యార్థులు

నిరసనలు కొనసాగిస్తున్నారు. అసెంబ్లీ ముట్టడికి యత్నించిన విద్యార్థులపై పోలీసులు వాటర్ కేనన్లు ప్రయోగించడంతో పాటు బలప్రయోగం చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. తాము విద్యార్థులతో సంప్రదింపులు జరుపుతున్నామని, వారి డిమాండ్లలో చాలావరకు అంగీకరించామని ప్రభుత్వం పేర్కొంటుండగా, విద్యార్థులు మాత్రం ఈ వాదనను తోసిపుచ్చుతూ తమ పోరాటాన్ని సాగిస్తున్నారు.

# 'లుంగీవాలా' వ్యాఖ్యలపై రాజ్యసభలో రగడ..

అనుచిత వ్యాఖ్య చేశారని సభ దృష్టికి తీసుకురావడంతో వివాదం మొదలైంది. ఇరువర్గాల సభ్యుల నినాదాలతో సభా కార్యకలాపాలు స్తంభించాయి. దీంతో ఛైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. బ్రిటాస్‌ను బీజేపీ ఎంపీ సుష్మితా దేవ్ లుంగీవాలాగా సంబోధించినట్లు సమాచారం.

### బ్రిటాస్ అభ్యంతరం

అత్యవసర ప్రజా ప్రాధాన్య అంశాలను ప్రస్తావించే సమయంలో బ్రిటాస్ ఈ విషయాన్ని లేవనెత్తారు. ఓ మహిళా సభ్యురాలు తనను 'లుంగీవాలా' అని సంబోధించారని చెప్పారు. ఇది తనను, తన సంస్కృతిని అవమానించడమేనని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం మొదలైంది.

### 'అందరూ భారతీయులే'

సభలో ప్రతి సభ్యుడూ సమానమేనని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. "మనమంతా భారతీయులమే" అని పేర్కొన్నారు. దేశ ప్రతిష్ఠకు భంగం కలిగించే వ్యాఖ్య ఏదైనా ఉంటే సంబంధిత సభ్యులను ఛైర్మన్ ఛాంబర్‌కు పిలిచి మాట్లాడాలని సూచించారు. ఛైర్మన్ రాధాకృష్ణన్ కూడా సభ్యులు సంయమనం పాటించాలని కోరారు. "మన సంస్కృతి ప్రత్యేకమైనది. సంస్కృతి, గుర్తింపు, మతాన్ని అగౌరవపరచకూడదు. సంబంధిత సభ్యురాలిని నా ఛాంబర్‌కు పిలిచి సమస్యను పరిష్కరిస్తాను" అని చెప్పారు.

### 'అది లుంగీ కాదు.. ధోతి'

అయినా సభలో గందరగోళం కొనసాగింది. సభా నాయకుడు జేపీ నడ్డా మాట్లాడుతూ, సంబంధిత వస్త్రాన్ని 'లుంగీ'గా కాకుండా 'ధోతి'గా పేర్కొన్నారు. మరోవైపు సుష్మితా దేవ్ వాదనను కూడా రికార్డులోకి తీసుకోవాలని చెప్పారు. ఇరువైపులా నినాదాలు కొనసాగడంతో ఛైర్మన్ సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు.

---

# చంద్రబాబు ఒక విజనరీ లీడర్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

*(మొదటి పేజీ తరువాయి)*

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనా దక్షతపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసలు కురిపించారు. చంద్రబాబు విజనరీ లీడర్ అని కొనియాడిన ఆమె... రాష్ట్రంలో నిజమైన అభివృద్ధికి ఆయనే అసలైన చిరునామా అని స్పష్టం చేశారు. సాంకేతికత, పాలన, మౌలిక సదుపాయాల కల్పనలో ఆయన చేపట్టిన సంస్కరణలు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధికి, ముఖ్యంగా అమరావతి నిర్మాణానికి, ఐటీ, పారిశ్రామిక రంగాల పురోగతికి చంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా దూరదృష్టి కలిగిన నాయకత్వంతో ఏపీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రపతి నుంచి వచ్చిన ఈ ప్రశంసలపై టీడీపీ శ్రేణులు, కూటమి నాయకులు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును విజయనగరం టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తన కుటుంబంతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతికి 'అమరావతి' కాఫీ టేబుల్ బుక్‌ను బహూకరించారు. ఆ పుస్తకంలోని రాజధాని అమరావతి విశేషాలు, ఫొటోలను రాష్ట్రపతి ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టిని కొనియాడుతూ, ఆయన నిజమైన అభివృద్ధికి చిరునామా అని, ఒక విజనరీ లీడర్ అని రాష్ట్రపతి ప్రశంసల వర్షం కురిపించారు. అంతేకాకుండా, ఎంపీ అప్పలనాయుడి నిబద్ధతను రాష్ట్రపతి ప్రత్యేకంగా అభినందించారు. పార్లమెంట్ సమావేశాలకు ప్రతిరోజూ సైకిల్‌పై రావడం, 100 శాతం హాజరు నమోదు చేసుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. సంస్కారం, నిరాడంబరత కలిగిన అప్పలనాయుడిని చూస్తుంటే "నన్ను నేను చూసుకున్నట్లే ఉంది" అని అన్నారు.

# మేం 'టీ-హబ్' కడితే.. రేవంత్ 'అనుముల హబ్' కడుతున్నారు: కేటీఆర్

సీఎం సోదరుడికి సంబంధముందని ఆరోపిస్తున్న టెస్సారక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు భూ కేటాయింపుల విషయంలో రూ. 200 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపిస్తూ, సీఎం రేవంత్ రెడ్డి 'అనుముల హబ్స్' ఏర్పాటులో బిజీగా ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. బుధవారం ఈ అంశంపై 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా కేటీఆర్ స్పందించారు. "తాము నిజమైన స్టార్టప్‌ల అభివృద్ధి కోసం టీ-హబ్ నిర్మిస్తే, రేవంత్ రెడ్డి మాత్రం కుటుంబ సభ్యులతో నడిచే, సున్నా ఆవిష్కరణలు, సున్నా ఉద్యోగులతో కూడిన స్కామ్.. అదేనండీ స్కీమ్ అయిన 'అనుముల హబ్స్' సృష్టిస్తున్నారు. అనుముల సోదరుల్లో ఒకరైతే చాలు, ఎలాంటి ప్రశ్నలు లేకుండా చౌక ధరకే ప్రభుత్వ భూమిని కేటాయిస్తారు. సున్నా పెట్టుబడితో రాత్రికి రాత్రే రూ. 200 కోట్లు సంపాదించినందుకు అనుముల కొండల్ రెడ్డిని 'శతాబ్దపు ఆవిష్కర్త'గా ప్రకటించాలి" అని కేటీఆర్ తన పోస్టులో పేర్కొన్నారు. కేవలం రూ. లక్ష చెల్లింపు మూలధనం, సున్నా ఉద్యోగులు ఉన్న కంపెనీకి అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని ఎలా కేటాయిస్తారని ఆయన ప్రశ్నించారు. సుమారు రూ. 200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని కేవలం రూ. 7 కోట్లకే, అంటే గజం రూ. 3,700 చొప్పున కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ భూముల నుంచి కోట్లాది రూపాయలు సంపాదించే ఈ మ్యాజిక్ ట్రిక్‌ను కేవలం అనుముల కుటుంబానికే పరిమితం చేయకుండా తెలంగాణ యువతకు కూడా నేర్పించాలని మంత్రి శ్రీధర్ బాబు, సీఎం రేవంత్ రెడ్డిలను ఉద్దేశించి అన్నారు. టెస్సారక్ట్ సంస్థతో సీఎం సోదరుడికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు చేసిన ప్రకటనను కేటీఆర్ తప్పుబట్టారు. కొండల్ రెడ్డి లింక్డ్ఇన్ ప్రొఫైల్‌లో, యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్‌లో ఆయన్ను టెస్సారక్ట్ ఛైర్మన్‌గా గుర్తించిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ భూ కేటాయింపులకు సంబంధించిన జీవో, భూమి విలువ, అర్హత ప్రమాణాలు, పెట్టుబడి ప్రతిపాదనలు వంటి అన్ని పత్రాలను ప్రభుత్వం వెంటనే బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ భూ కేటాయింపుల వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని, దీనిపై ముందుగా గవర్నర్‌కు ఫిర్యాదు చేసి, అవసరమైతే లోకాయుక్తను, న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. వాస్తవాలు వెలుగులోకి వచ్చి, బాధ్యులను శిక్షించే వరకు ఈ అంశాన్ని వదిలిపెట్టబోమని ఆయన స్పష్టం చేశారు.

# హెచ్ఐవీ నియంత్రణకు 60 రోజుల ప్రత్యేక ప్రచారం

సమాచార, విద్య, ప్రచారం పేరుతో తయారు చేసిన కార్యాచరణ ప్రణాళిక అమలు కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్ఐవీ నియంత్రణలో రాష్ట్రం గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. గతంతో పోలిస్తే కొత్త హెచ్ఐవీ ఇన్ఫెక్షన్లు 77 శాతం, మరణాలు 87 శాతం తగ్గడం ఇందుకు నిదర్శనమన్నారు. ఈ క్రమంలో అంచనా వేసిన హెచ్ఐవి బాధితుల్లో 95 శాతం మందికి హెచ్ ఐవి వచ్చినట్లు తెలిసి ఉండాలని, తెలిసిన వారిలో 95 శాతం మంది మందులు వాడుతూ ఉండాలని, మందులు వాడే వారిలో 99 శాతం మందికి వైరల్ లోడ్ బాగా తగ్గి ఉండాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిందన్నారు. ఈ మూడు కేటగిరీల్లో రాష్ట్ర ప్రభుత్వం 88-87-96.2 శాతం మేర పురోగతిని సాధించిందని చెప్పారు. మిగిలిన లక్ష్యాన్ని(95-95-99) డిసెంబరు 1 గడువులోగా లక్ష్యాన్ని సాధించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు.

### డిసెంబరు లక్ష్యంపై కేంద్రీకృత కార్యాచరణ

ఈ మూడు దశల్లో ఎక్కడ లోటు ఉందో గుర్తించి.. అక్కడే ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాల వారీగా పురోగతిని నిరంతరం పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ లక్ష్యాల సాధనలో యువతను ప్రధాన భాగస్వామ్యం చేయాలని, సామాజిక మాధ్యమాల ద్వారా సందేశాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

### 'సురక్ష'తో జిల్లాల వారీగా పర్యవేక్షణ

హెచ్ఐవీ నియంత్రణ కార్యక్రమాల పురోగతిని, జిల్లాల వారీగా ఉన్న లోటుపాట్లను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు తయారు చేసిన లి'సురక్ష డ్యాష్‌బోర్డ్'లిను మంత్రి ఆవిష్కరించారు. దీని ద్వారా ఏ జిల్లాలో పురోగతి ఎలా ఉంది? ఎక్కడ లోటు ఉంది? ఎక్కడ ప్రత్యేక దృష్టి అవసరం? ఏ ప్రాంతాల్లో చర్యలను వేగవంతం చేయాలి? వంటి అంశాలను గుర్తించి తదనుగుణంగా కార్యాచరణ చేపట్టే అవకాశం ఉంటుంది.

### యువతతో 60 రోజుల ప్రత్యేక ప్రచారం

రాబోయే 60 రోజుల పాటు గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి జి.వీరపాండియన్ తెలిపారు.
ఎయిడ్స్ రహిత దేశం కోసం సన్నద్ధీకరణలో భాగంగా జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మార్గదర్శకాల ప్రకారం డిసెంబరు నాటికి 'సురక్షిత్ , సురక్షిత్ ప్లస్' లక్ష్యాలను సాధించే దిశగా కార్యాచరణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. జానపద కళాజాతాలు, సామాజిక మాధ్యమాలు, కరపత్రాల ద్వారా ప్రచారాన్ని నిర్వహించాలని తెలిపారు.

### తల్లి నుంచి బిడ్డకు సంక్రమణ నివారణ

గర్భిణీలకు ముందస్తుగా హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించి.. అవసరమైన వైద్య సేవలు, చికిత్స అందించడం ద్వారా తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ సంక్రమించకుండా చర్యలు తీసుకోనున్నట్లు ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ చక్రధర్ బాబు తెలిపారు. అవసరమైన వారికి సకాలంలో చికిత్స అందేలా సేవలను బలోపేతం చేయనున్నట్లు పేర్కొన్నారు.

### ఏఆర్‌టీ కేంద్రాల పనితీరుపై సమీక్ష

జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో ఏఆర్‌టీ కేంద్రాల పనితీరును సమీక్షించడంతో పాటు.. చికిత్స పొందుతున్న వారి కొనసాగింపును పర్యవేక్షిస్తున్నామని ఏపీ శాక్స్ ప్రాజెక్టు డైరెక్టర్ స్మరణ్ రాజ్ తెలిపారు. హెచ్ఐవీ నిర్ధారణ అయిన వారికి చికిత్స అందేలా, చికిత్సలో ఉన్నవారికి నిరంతర సేవలు అందేలా చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.
రాబోయే 60 రోజుల్లో చేపట్టే ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థలు, వల్నరబుల్ వర్గాల వరకు విస్తరించనున్నారు. యువత, స్వచ్ఛంద సంస్థలు, వైద్య సిబ్బంది, విద్యాసంస్థలు, ప్రసార మాధ్యమాల భాగస్వామ్యంతో ప్రచారాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్తామన్నారు. గర్భిణీల పరీక్షలు, తల్లి నుంచి బిడ్డకు సంక్రమణ నివారణ, ఏఆర్‌టీ చికిత్స కొనసాగింపు, వైరల్ లోడ్ నియంత్రణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టనున్నారు. ప్రతి జిల్లాలోని గ్యాప్‌ను గుర్తించి.. దానికి తగిన చర్యలు తీసుకుంటాం. గుర్తింపు నుంచి చికిత్స వరకు, చికిత్స నుంచి వైరల్ లోడ్ నియంత్రణ వరకు ప్రతి దశను పర్యవేక్షిస్తాం.

# జెన్-జీకి ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచన

*(మొదటి పేజీ తరువాయి)*

రైల్వే స్టేషన్లలో తరచూ కనిపించే ఒక హెచ్చరికను ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. "షార్ట్‌కట్ విల్ కట్ యు షార్ట్" (అడ్డదారి మీ జీవితాన్ని కుదిస్తుంది) అనే బోర్డు కేవలం రైల్వే ట్రాక్‌లకే కాకుండా, నిజ జీవితానికి కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు అందుబాటులో ఉన్నప్పటికీ, త్వరగా వెళ్లాలనే తొందరలో కొందరు ప్రమాదకరంగా పట్టాలు దాటుతుంటారని, అటువంటి అనాలోచిత నిర్ణయాలు ప్రాణాంతకమని ఆయన హెచ్చరించారు. యువత తప్పుడు మార్గాలను వీడి, అర్థవంతమైన జీవన గమనాన్ని ఎంచుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. "మీరు ఆరాధించే మహనీయుల జీవిత చరిత్రలను తప్పనిసరిగా చదవండి. వాటి ద్వారా స్ఫూర్తి పొంది సరైన మార్గాన్ని కనుగొనవచ్చు" అని ఆయన యువతకు సలహా ఇచ్చారు. ముఖ్యంగా ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసే ఇన్‌ఫ్లుయెన్సర్ల కంటెంట్ పట్ల నిరంతరం జాగ్రత్తగా ఉండాలని ఆయన హితవు పలికారు.

# రాహుల్ గాంధీపై బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే తీవ్ర విమర్శలు

*(మొదటి పేజీ తరువాయి)*

పాకిస్థాన్ వ్యవస్థాపకుడు మహమ్మద్ అలీ జిన్నా, రాహుల్ గాంధీ రూపంలో పునర్జన్మించారని, జిన్నా కంటే కూడా రాహుల్ అత్యంత ప్రమాదకరమైన నాయకుడని బుధవారం ఆయన విమర్శించారు. ఈ మేరకు తన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. ఝార్ఖండ్‌లో ఉద్యోగ నియామక పరీక్షల్లో అవకతవకలపై విద్యార్థులు చేపట్టిన నిరసనల నేపథ్యంలో దూబే ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కుంభకోణంపై సీబీఐ విచారణను కాంగ్రెస్ పార్టీ ఎందుకు వ్యతిరేకిస్తోందని ఆయన నిలదీశారు. ప్రధాన నిందితుడు ఝార్ఖండ్ ప్రభుత్వంలోని ఒక సీనియర్ అధికారి నివాసంలో పట్టుబడ్డాడని, ఒకవేళ సీబీఐ విచారణ నిష్పక్షపాతంగా జరిగితే ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు కూడా చిక్కులు తప్పవని ఆరోపించారు. విద్యార్థులకు నిజంగా సంఘీభావం తెలపాలనుకుంటే ఝార్ఖండ్ ప్రభుత్వానికి కాంగ్రెస్ తన మద్దతును వెంటనే ఉపసంహరించుకోవాలని దూబే సవాల్ విసిరారు. లేనిపక్షంలో ఆ పార్టీ జార్జ్ సోరోస్ అజెండాతో పనిచేస్తున్నట్లు భావించాల్సి ఉంటుందని అన్నారు. ప్రధానికి వ్యతిరేకంగా ఎక్కడ నిరసనలు జరిగినా రాహుల్ గాంధీ అక్కడ ప్రత్యక్షమవుతున్నారని ఆయన మండిపడ్డారు. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్సీ), స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జేఎస్ఎస్సీ) పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ విద్యార్థులు 19 రోజులుగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, వివాదాస్పద పరీక్షల రద్దు, స్వతంత్ర విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల అసెంబ్లీ ముట్టడికి యత్నించిన విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్, వాటర్ కేనన్లు, బాష్పవాయువు ప్రయోగించడంతో బీజేపీ రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ జరపాలని బీజేపీ పట్టుబడుతుండగా, చర్చల ద్వారా సమస్యను పరిష్కరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటోంది.

# అమెరికాలో అదానీపై కేసు కొట్టివేత..

*(మొదటి పేజీ తరువాయి)*

అమెరికాలో అదానీకి సంబంధించిన కేసు కొట్టివేతపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ఈ పరిణామంపై ప్రధాని నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకుని ఘాటు విమర్శలు చేశారు. అమెరికా కోర్టు నిర్ణయం వెనక మరింత కథ ఉందని వ్యాఖ్యానించారు. అమెరికాలో అదానీ, ఆయన బంధువు సాగర్ అదానీ సహా ఇతరులపై నమోదైన దాదాపు రెండేళ్ల నాటి క్రిమినల్ కేసును న్యూయార్క్‌లోని ఫెడరల్ న్యాయమూర్తి సోమవారం కొట్టివేశారు. ఈ కేసును కొనసాగించాల్సిన అవసరం లేదని అమెరికా న్యాయశాఖ కోర్టును కోరింది. ఈ నేపథ్యంలో కేసు కొట్టివేత వార్త స్క్రీన్‌షాట్‌ను రాహుల్ తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేస్తూ మోదీపై విమర్శలు చేశారు. "పైకి కనిపిస్తున్నదానికంటే ఈ వ్యవహారం వెనుక ఇంకా చాలా ఉంది. ఒత్తిడికి లోనైన ప్రధాని భారత ప్రయోజనాలను తాకట్టు పెట్టాల్సి వచ్చింది. అందుకు దేశం భారీ మూల్యం చెల్లిస్తోంది" అని రాసుకొచ్చారు. ఈ కేసులో భారత్‌లోని ప్రభుత్వ అధికారులకు లంచం ఇచ్చేందుకు కుట్ర చేశారన్నది ప్రధాన ఆరోపణ. సౌర విద్యుత్ ప్రాజెక్టు కాంట్రాక్టు దక్కించుకునేందుకు ఈ ప్రయత్నం జరిగిందని 2024 నవంబరులో అమెరికా అధికారులు అభియోగాలు నమోదు చేశారు. అయితే అదానీ గ్రూప్ ఈ ఆరోపణలను అప్పట్లోనే ఖండించింది. తమ సంస్థలు, అధికారులు చట్టాలకు అనుగుణంగానే వ్యవహరించారని స్పష్టం చేసింది. కేసును కొట్టివేయాలన్న న్యాయశాఖ నిర్ణయంపై న్యాయమూర్తి నికోలస్ గరాఫిస్ గతంలో ప్రశ్నలు లేవనెత్తారు. నిర్ణయానికి మరిన్ని వివరణలు ఇవ్వాలని కోరారు. నిందితులు అమెరికా పౌరులు కాదని, వారు ఎప్పుడూ అమెరికా కోర్టుకు హాజరు కాలేదని న్యాయశాఖ పేర్కొంది.

# గోదావరి జలాల వినియోగంపై సీఎం కీలక ఆదేశాలు

*(మొదటి పేజీ తరువాయి)*

మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలలో కొన్ని లోపాలను గుర్తించినట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించగా, ఈ అంశంపై తక్షణమే ఎన్డీఎస్ఏను సంప్రదించాలని సీఎం సూచించారు. దేవాదుల ప్రాజెక్టులో తొమ్మిది పంపుల ద్వారా నీటిని లిఫ్ట్ చేయడం కీలకమని, అక్కడ ఎదురవుతున్న చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన రైతులకు చెల్లించాల్సిన పరిహారంపై కూడా ఈ సమావేశంలో సమీక్షించారు. నష్టపరిహారాన్ని తక్షణమే చెల్లించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ముంపునకు గురయ్యే గ్రామాలు, పెండింగ్ పరిహారం, పునరావాస ప్యాకేజీలపై క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికలు అందజేయాలని రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులను ఆదేశించారు. బాధితులకు త్వరితగతిన పరిహారం చెల్లిస్తేనే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టులను నింపడానికి వీలవుతుందని ఆయన పేర్కొన్నారు. గట్టు, గుడెందొడ్డి ఎత్తిపోతల పథకాల సామర్థ్యం పెంపుపై తగిన అధ్యయనం చేయాలని, గుడెందొడ్డి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు కన్సల్టెంట్‌ను నియమించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 21,627 మందికి ఉద్యోగాలు..
## పరిశ్రమలకు సీఎం చంద్రబాబు ప్రోత్సాహం

సమావేశాల ద్వారా మొత్తం 363 ప్రతిపాదనలకు ఆమోదం లభించిందని, తద్వారా రూ.13.78 లక్షల కోట్ల పెట్టుబడులు, 10.86 లక్షల ఉద్యోగాలు రాష్ట్రానికి రానున్నాయని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, కేవలం సంప్రదాయ పరిశ్రమలే కాకుండా భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు గ్రీన్ అమ్మోనియా, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్ వంటి అధునాతన రంగాలపై దృష్టి సారించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు అనుసరించాల్సిన విధానాలపై అధ్యయనం చేయాలని సూచించారు. పారిశ్రామిక ప్రాజెక్టుల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించి, వాటిపై కొందరు పనిగట్టుకుని చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని అన్నారు. ఉత్తరాంధ్రలో ఏర్పాటు చేస్తున్న డేటా సెంటర్లకు కేవలం 3.5 టీఎంసీల నీరు సరిపోతుందని, పోలవరం ఎడమ కాలువ ద్వారా గ్రావిటీపైనే విశాఖ పరిశ్రమలకు నీటిని అందిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని అడ్డుకునేందుకు కొందరు రాజకీయ నిరుద్యోగులు సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా కొత్త ప్రాజెక్టులను ఆయా ప్రాంతాల్లో నెలకొల్పేలా చూడాలని అన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న రక్షణ రంగ ప్రాజెక్టులు జాతికే గర్వకారణమని, పుట్టపర్తి సమీపంలో డిఫెన్స్, హిందూపురం వద్ద ఏరోస్పేస్ ప్రాజెక్టులు ఏర్పాటు కావాలని ఆకాంక్షించారు. మూలపేట పోర్టు నిర్మాణాన్ని డిసెంబరు నాటికి పూర్తి చేసి ప్రారంభించాలని ఆదేశించారు. రాయలసీమలో పండే ఉద్యాన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు తరలించేందుకు రోడ్, రైల్, పోర్టు కనెక్టివిటీని బలోపేతం చేయాలన్నారు. సెప్టెంబరు నాటికి 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని, 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్' కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

# కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని మర్యాద పూర్వకంగా కలిసిన నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.

పల్లె వెలుగు న్యూఢిల్లీ. న్యూ ఢిల్లీలోని కేంద్ర రహదారులు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని వారి కార్యాలయంలో బుధవారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి మర్యాదపూర్వకంగా కలిసి నంద్యాల పార్లమెంట్ పరిధిలోని పలు సమస్యలను వినతి పత్రం ద్వారా వివరించారు. నంద్యాల జిల్లా ప్రజల భద్రత, సౌకర్యం, మెరుగైన రవాణా కనెక్టివిటీకి సంబంధించిన పలు ముఖ్యమైన అభ్యర్థనలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు. బొల్లవరం, కరివేన, ఆత్మకూరు--సిద్ధపల్లె జంక్షన్ వద్ద అండర్‌పాస్‌లు, పారుమంచాల వద్ద మీడియన్ ఓపెనింగ్, డిపాల్ స్కూల్ సమీపంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, భానుముక్కల -- ఇస్కాల గ్రామాల్లో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ని కోరానన్నారు. అలాగే ఎన్ హెచ్-340సి (ఆత్మకూరు--దోర్నాల), ఎన్ హెచ్-544డి (బుగ్గ--కైప--గిద్దలూరు) రహదారులకు సంబంధించిన డి పి ఆర్ ల ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశానని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు.



# నంద్యాల 'అన్నా క్యాంటీన్'ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.

- ఆహార నాణ్యత, పరిశుభ్రతను స్వయంగా పరిశీలించిన మంత్రి ఫరూక్.
- భోజనం చేస్తున్న నిరుపేదలతో మాట్లాడి అభిప్రాయాలు సేకరణ.
- నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు ఆదేశం.





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి పర్యటనలో భాగంగా రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న 'అన్నా క్యాంటీన్'ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా క్యాంటీన్‌లో సిద్ధం చేస్తున్న వంటకాల నాణ్యతను, కిచెన్ పరిసరాల పరిశుభ్రతను మంత్రి ఫరూక్ స్వయంగా పరిశీలించారు. అనంతరం క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న సామాన్యులు, ఆసుపత్రికి వచ్చిన రోగుల బంధువులతో మంత్రి ఎన్ఎండి ఫరూక్ నేరుగా మాట్లాడి, ఆహార రుచి, నాణ్యత మరియు సదుపాయాలపై వారిని అడిగి తెలుసుకున్నారు.

# నంద్యాల కళారాధన నటుడు ఎస్.ఆర్.ఎస్. ప్రసాద్ నటించిన "పళ్ళ బురుసు" సినిమా.

**సినిమా విజయవంతమై, ప్రసాద్ కు మంచి పేరు రావాలని శుభాకాంక్షలు తెలిపిన కళారాధన అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ రవి కృష్ణ.**




పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల వాసి, కళారాధన సాంస్కృతిక సంస్థ నిర్వాహక కార్యదర్శి, ప్రముఖ రంగస్థల, టీవీ, సినీ నటులు, నంది,కళా రత్న,కందుకూరి రంగస్థల రాష్ట్ర స్థాయి పురస్కార గ్రహీత ఎస్.ఆర్.ఎస్. ప్రసాద్ ముఖ్యమైన పాత్రలో అన్నపూర్ణ స్టూడియోస్ తరపున అక్కినేని నాగార్జున నిర్మించిన "పళ్ళ బురుసు" సినిమా ఆగస్టు 14న థియేటర్లలో విడుదలవుతున్నది. సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధాన పాత్రలలో నటించిన ఈ చిత్రంలో ముఖ్యమైన పాత్రలో ఎస్.ఆర్.ఎస్. ప్రసాద్ నటించారు.

నాలుగు దశాబ్దాలుగా రంగస్థల నటుడు గా రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ప్రసాద్ రెండు సంవత్సరాలుగా టీవీ సీరియల్లలో, సినిమాలలో నటించడం ప్రారంభించారు.

తెలంగాణ ప్రాంత గ్రామీణ వాతావరణం లో, కుటుంబ అనుబంధాల నేపథ్యంలో, హాస్యం, భావోద్వేగాలు కలిపి రూపొందించిన ఈ చిత్రం విజయవంతం కావాలని కళారాధన అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మధుసూదనరావు డాక్టర్ రవి కృష్ణ ఆకాంక్షిస్తూ, నంద్యాల వాసి నటించిన ఈ సినిమాను నంద్యాల ప్రజలు, కళాకారులు చూసి ఎస్ ఆర్ ఎస్ ప్రసాద్ ను అభినందించాలని కోరారు. నంద్యాలలో ఈ సినిమా గురువారం నుండి నిధి సినిమా థియేటర్లో మార్నింగ్ షో, మెట్నీ షో లు గా ప్రదర్శిస్తారని తెలిపారు.



# 18 వ తేదీ న విద్యారంగ సమస్యల పరిష్కారానికి చలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయండి యుఎస్ఎఫ్.




పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. విద్యారంగ సమస్యల పరిష్కారానికై సమరశీల పోరాటాలకు విద్యార్థిలోకం కదలి రావాలి -- యు ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే విధానాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం సమరశీల పోరాటాలకు రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థిలోకం సిద్ధం కావాలి అన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో దేశంలోనే ఏపీ టాప్ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో విడుదల చేసిన యు డి ఐ ఎస్ ఈం గణాంకాల ప్రకారం.. దేశవ్యాప్తంగా విద్యావ్యవస్థలో ఒక విస్తుపోయే నిజం బయటకు వచ్చింది అన్నారు. సింగిల్ టీచర్ స్కూల్స్ దేశవ్యాప్తంగా 1,00,843 పాఠశాలలు కేవలం ఒకే ఒక్క టీచర్‌తో నడుస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానం దేశంలోనే అత్యధికంగా ఏపీలో 16,357 సింగిల్ టీచర్ స్కూల్స్ ఉన్నాయి. తర్వాతి స్థానాలు ఏపీ తర్వాత జార్ఖండ్, మహారాష్ట్ర వరుస స్థానాల్లో నిలిచాయి. దిన్ని బట్టి కూటమి ప్రభుత్వ విద్యకు ఎంత ప్రాధాన్యత ఇస్తుందో అర్థం అవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా 54 బీసి వసతి గృహాలను మూసివేయడం దారుణం ఉమ్మడి అన్నమయ్య జిల్లాలో 14 బీసీ సంక్షేమ వసతి గృహాలను మూసివేస్తుండడం తీవ్ర అన్యాయం అన్నారు. ముఖ్యంగా కోడూరు డివిజన్ పరిధిలో ఒక్క బీసీ వసతి బాలురు గృహం కూడా లేకపోవడం వల్ల పేద, బీసీ, మైనారిటీ విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం పునఃసమీక్షించి, మూసివేస్తున్న వసతి గృహాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సంక్షేమ హాస్టళ్లలో కనీస మౌలిక వసతులు త్రాగునీటి కోసం ఆర్ఓ ప్లాంట్లు, దోమతెరలు, ప్రతి నెల వైద్య పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జయ సింహా రెడ్డి, జిల్లా కార్యదర్శి సురేంద్ర నాయక్, దేవానంద్,తదితరులు పాల్గొన్నారు.

# బాలికలకు శక్తి టీం రక్షణ..






గడివేముల, పాణ్యం పల్లె వెలుగు దినపత్రిక నంద్యాల సబ్ డివిజన్ శక్తి టీం సిబ్బంది హెడ్ కానిస్టేబుల్స్ వెంకటేశ్వర్లు ప్రసాదు అయిన మేము రాజశ్రీ ఎస్పీ సార్ గారి ఆదేశాల మేరకు రాజశ్రీ ఏ ఎస్ పి సుస్మిత మేడమ్ గారి ఉత్తర్వుల మేరకు పాణ్యం మండలం గోరుకల్లు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు గల విద్యార్థినులకు విద్యార్థులకు హెడ్మాస్టర్ ఆధ్వర్యంలో ప్రభుత్వం వారు ప్రతిష్టాత్మకంగా రూపొందించిన శక్తి యాప్ గురించి శక్తి యాప్ నంబర్ 7993485111 ను తెలిపి ఎక్కడైనను సైబర్ నేరంలు జరిగినచో టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫోన్ చేయవలెనని చిన్నపిల్లల పైన నేరములు బాల్యవివాహములు జరిగిన టోల్ ఫ్రీ నెంబర్ 1098కు ఫోన్ చేయవలెనని చెప్పినాము శక్తి యాప్ వలన కలిగే ఉపయోగం లను వివరించడం అయినది వన్ స్టాప్ సెంటర్ యొక్క ప్రాముఖ్యతను శక్తి టీమ్ల పనితీరును తెలిపి ఆపద సమయంలో అమ్మాయిలు శక్తి యాప్ నంబర్ కు వీడియో కాల్ గాని నార్మల్ కాల్ గాని చేసినచో పోలీసులు తక్షణమే స్పందిస్తారని చెప్పి ఎక్కడైనను నేరములు జరిగిన ఈవ్ టీజింగ్ మరియు ర్యాగింగ్ జరిగిన వెంటనే ఎమర్జెన్సీ కాల్ 112 100 కు ఫోన్ చేయవలెనని తెలిపినాము అమ్మాయిల మహిళల రక్షణ మరియు భద్రత పోలీసుల ముఖ్య ఉద్దేశ్యము అని చెప్పి ప్రతి అమ్మాయి మరియు మహిళల మొబైల్ నందు శక్తి యాప్ ఉండవలెనని విద్యార్థులు చెడు అలవాట్లకు లోను కాకుండా ఉండి బాగుగా చదువుకోన వలయునని తెలిపి మైనర్ డ్రైవింగ్ చేయరాదని అట్లు చేయుట నేరమని తెలిపి నాము అమ్మాయిలు ఇంటికి వెళ్లిన తర్వాత తమ తల్లిదండ్రుల మొబైల్ మరియు అక్క పిన్ని మొదలగు వారి మొబైల్ నందు శక్తి యాప్ డౌన్లోడ్ చేయవలెనని శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకునే విధానము తెలిపి అవేర్నెస్ ప్రోగ్రాం చేయడమైనది

# జూనియర్ డాక్టర్ల సమస్యలను పరిష్కరిస్తాం: మంత్రి ఎన్ఎండి ఫరూక్.

**నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో మంత్రి ఫరూక్ కి వినతిపత్రం అందజేసిన జూనియర్ డాక్టర్లు.**
**జూడాల డిమాండ్ల పై సానుకూలంగా స్పందించిన రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్.**






పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి పర్యటనలో భాగంగా విచ్చేసిన రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ (ఏపీ జూడ ) ప్రతినిధులు, జూనియర్ డాక్టర్లు నేరుగా కలసి తమ పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, టీచింగ్ హాస్పిటల్స్‌లో పనిచేస్తున్న ఇంటర్న్‌, పోస్ట్ గ్రాడ్యుయేట్స్ (పీజీ లు), సూపర్ స్పెషాలిటీ పీజీలు, సీనియర్ రెసిడెంట్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను, సమ్మె (స్టేటవైడ్ స్ట్రైక్) కారణాలను జూనియర్ డాక్టర్లు మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకెళ్లారు. తమకు న్యాయం చేయాలని, గౌరవప్రదమైన రీతిలో సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. జూనియర్ డాక్టర్ల సమస్యలపై స్పందించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ వైద్య రంగానికి, ప్రజారోగ్యానికి జూనియర్ డాక్టర్లు అందిస్తున్న సేవలు ఎంతో కీలకమైనవని తెలిపారు . జూనియర్ డాక్టర్ల సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి మరియు సంబంధిత ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా సానుకూల పరిష్కారం లభించేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు, హాస్పిటల్ సిబ్బంది మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# చుక్కల భూములకు విముక్తి: 70 మంది రైతు కుటుంబాల ఇంట వెలుగులు!

- **22ఏ(1) నిషేధిత జాబితా నుంచి 120 ఎకరాల తొలగింపు**
- **ప్రభుత్వ ఉత్తర్వులు +ా.వీం.చీశ: 444, 445 ల ప్రకారం హక్కుల పునరుద్ధరణ**
- **రైతులకు భూ పత్రాలు అందజేసిన పాణ్యం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి**






పల్లె వెలుగు కర్నూలు బ్యూరో దశాబ్దాలుగా రైతులను వెంటాడుతున్న 'చుక్కల భూముల' చిక్కుముడి ఎట్టకేలకు వీడింది. భూములపై సర్వహక్కులు కోల్పోయి ఆర్థికంగా, మానసికంగా నలిగిపోయిన రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఊరటనిచ్చింది. జీవో ఎంఎస్ నంబర్ 444, 445 ల మార్గదర్శకాలను అనుసరించి కర్నూలు జిల్లా కల్లూరు మండలం యాపర్లపాడు, వెల్దుర్తి మండలం పుల్లగుమ్మి, రామళ్లకోట గ్రామాల పరిధిలోని దాదాపు 120 ఎకరాల భూమిని 22ఏ(1) నిషేధిత జాబితా నుండి శాశ్వతంగా తొలగించారు. రికార్డులు క్లియర్ అయిన భూ పత్రాలను 70 మంది రైతు కుటుంబాలకు పాణ్యం నియోజకవర్గం శాసనసభ్యురాలు, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా పంపిణీ చేశారు.

రైతు సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ--- "తరతరాలుగా సాగు చేసుకుంటున్నా హక్కుల్లేక అల్లాడిపోయిన రైతులకు ఇది నిజమైన పండుగ రోజు. సొంత భూమిపై పూర్తి అధికారం లేక బ్యాంకుల రుణాలు అందక, నానా అవస్థలు పడ్డ నిరుపేద రైతులకు ఈ జీవోల ద్వారా విముక్తి లభించింది. ఏళ్ల నాటి సమస్యకు ముగింపు పలికి భూములపై స్పష్టమైన యాజమాన్య హక్కులు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యత" అని స్పష్టం చేశారు. ఇకపై ఈ భూములపై రైతులు ఆర్థిక లబ్ధి పొందవచ్చని, అమ్మకాలకు, రుణాలకు పూర్తి అర్హత లభిస్తుందని వివరించారు.

**పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు**

ఈ ఆనందోత్సవ కార్యక్రమంలో మండల తహసీల్దార్ ఆంజనేయులు, యాపర్లపాడు గ్రామ టీడీపీ నాయకులు రమణ, శివారెడ్డితో పాటు పుల్లగుమ్మి, రామళ్లకోట గ్రామాల ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది మరియు పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు. ఏళ్ల తరబడి వేధిస్తున్న భూ చిక్కులు తొలగిపోవడంతో రైతు కుటుంబాలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ ప్రభుత్వం మరియు ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డికు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# నంద్యాల టౌన్ 25వ వార్డులో వైభవంగా

## 'ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఎన్ఎండి ఫరూక్.

- ప్రజల ముంగిటకే కూటమి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి.
- హామీలను నెరవేరుస్తూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న సీఎం చంద్రబాబు.
- పర్యటనలో భాగంగా హోటల్‌లో దోస వేసి ఆకట్టుకున్న మంత్రి ఫరూక్.





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి అందుతున్నాయని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. బుధవారం నంద్యాల పట్టణంలోని 25 వ వార్డు, ప్రభుత్వ ఆసుపత్రి పరిసర ప్రాంతాలలో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మంత్రి ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి వార్డులోని ప్రతి ఇంటికీ స్వయంగా వెళ్లి, కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు సాధించిన ప్రగతిని, అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను స్థానికులకు పంపిణీ చేస్తూ, వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు.
ఈ పర్యటన మధ్యలో మంత్రి ఫరూక్ స్థానిక హోటల్‌ను సందర్శించి, అక్కడ సరదాగా దోస వేసి వార్డు ప్రజలను, కార్యకర్తలను ఆకట్టుకున్నారు.
ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం ద్వారా ప్రజలతో నేరుగా మమేకమై వారి అభిప్రాయాలు, సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుంటున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. యువత భవిష్యత్తు, పేదల సంక్షేమం, మహిళా సాధికారత, విద్య, ఉపాధి, మరియు మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. నంద్యాలలో చంద్రన్న సంక్షేమ పాలనపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ నాయకత్వానికి నంద్యాల ప్రజలు పూర్తి మద్దతుగా నిలుస్తున్నారని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు వాకా శివశంకర్ యాదవ్, అజ్మీర్, నంద్యాల మండల కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి, జెపి, గుద్దేటి వెంకటేశ్వర్లు, ప్రదీప్ కుమార్, స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు వార్డు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాల ప్రదర్శనను సందర్శించిన కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు దాసరి చింతలయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు..



పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాలలోని స్థానిక పొగాకు కంపెనీ దగ్గర ఉన్న ఆర్కే ఫంక్షన్ హాల్ నందు స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాల ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ప్రదర్శనను కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు దాసరి చింతలయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు దాసరి చింతలయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాల ప్రదర్శన ఏర్పాటు చేయడం చాలా సంతోషకరంగా ఉందని, స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాల ప్రదర్శనను ఎంబిటి బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాల ప్రదర్శన నంద్యాల పట్టణ ప్రజలు స్కూల్ పిల్లలు సందర్శిస్తున్నారు.. ఇలా ఒకే దగ్గర ఈ స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలను చూస్తుంటే నాకు చాలా ఆనందంగా ఉందని తెలియజేశారు.. స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాల ప్రదర్శన ఏర్పాటు చేసిన ఎంబిటి బాబు ఫౌండేషన్ వారికి మైనార్టీ నాయకులకు కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు దాసరి చింతలయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు దాసరి చింతలయ్య,జిల్లా ఉపాధ్యక్షులుపబ్బతి అబ్రహం, చాబోలూ సలాం,హమీద్, చాకలి పుల్లయ్య పాల్గొన్నరు ..

# ఇంటింటికి తెలుగుదేశం - ప్రజలతో మమేకం

నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 12. (పల్లె వెలుగు ):నంద్యాల పట్టణంలోని ఎస్బిఐ కాలనీ 16 వార్డులో డోర్ టు డోర్ కార్యక్రమం భూత్ ఇంచార్జి లయన్ ఇమ్మడి వెంకటరామకృష్ణుడు



ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమ్మడి వెంకట రామకృష్ణుడు మాట్లాడుతూ 2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణెదల పవన్ కళ్యాణ్, ఐటీ మరియు విద్యాశాఖ నారా లోకేష్ వారు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి, 156 బూత్ లో వార్డు ప్రజలను కలిసి వివరించారు. ఈ కార్యక్రమం లో మజ్జారి వెంకట చెన్నకేశవ, రామసుబ్బయ్య, ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# ఆశల ఊహల్లో అన్నదాతలు

## ఎల్ నినో పరిస్థితులపై రైతులకు శాస్త్రవేత్తల సూచనలు






బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 12: ఆశల ఊహల్లో అన్నదాతలు విహరిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నప్పటికీ రైతులు అడప దడపాగా బోరు బావుల క్రింద, మెట్ట ప్రాంతాల కింద డ్రై షోయింగ్ విధానంలో ఇప్పటికే రెండు వేల ఎకరాలకు పైగా వరిని సాగు చేశారు. శ్రీశైలం డ్యాం లో వరద నీరు ఉధృతంగా వస్తున్నాయని, ఈ కారణంగా ఎప్పుడైనా కర్నూలు కడప కాల్వకు నీరు వచ్చే అవకాశం ఉందని రైతులు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. శ్రీశైలం డ్యాంలో నీరు నిండితే కిందికి వదలక ఏం చేస్తారంటూ రైతాంగం ధీమాతో ఉంది. ఎల్ నీనో ప్రభావం కారణంగా గ్రామాలలో సాగునీటి కొరత తీవ్రంగా ఉందని, ఈ కారణంగా ఖరీఫ్ సీజన్లో వరి సాగుకు రైతులు ఆశలు వదులుకోవాల్సిందే అంటూ నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా తెగేసి చెబుతున్నారు. రైతులు ప్రత్యామ్నాయంగా ఆరుత డి పంటలు వేసుకోవాలని ఈ విషయంలో రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేసిన మేరకు శాస్త్రవేత్తలు గ్రామాలలో పర్యటించి రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. బండి ఆత్మకూరు మండల పరిధిలోని సోమయాజులపల్లి, భోజనం గ్రామాల్లో నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ( ఆర్ ఏ ఆర్ ఎస్) శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ ఆధ్వర్యంలో ఎల్ నినో ప్రభావంపై బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
ఆర్ఎఆర్ఎస్ ఎల్ నినో కంబ్యాక్ట్ టీం శాస్త్రవేత్తలు డా. మంజునాథ్, డా. రవి ప్రకాష్ రెడ్డి, డా. మోహన్ విష్ణువర్ధన్, డా. అశోక్ కుమార్ రైతులకు వర్షాభావ పరిస్థితుల్లో పంటలను కాపాడుకునే చర్యలు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై సూచనలు చేశారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లోనూ ఎల్ నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున వరి నారుమడులు వేయవద్దని, తక్కువ నీటితో, తక్కువ కాలవ్యవధిలో పూర్తయ్యే పంటలను సాగు చేయాలని సూచించారు. కొర్ర--కందులు, కొర్ర--ఆముదం, జొన్న--కందులు వంటి అంతర, మిశ్రమ పంటలను వేసుకోవాలని రైతులను ప్రోత్సహించారు. మొక్కజొన్న, సోయాబీన్ తదితర పంటలు బెట్ట పరిస్థితులకు గురైతే 0.5 శాతం పొటాషియం నైట్రేట్ లేదా 19:19:19 ద్రావణాన్ని పిచికారీ చేయాలని తెలిపారు. నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో బెట్ట పరిస్థితులను తట్టుకునేందుకు తగిన నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. సజ్జ ఏబీవి -04, మినుము, కొర్ర, ఆముదం ఐ సి హెచ్ -5, ఐ సి హెచ్-55 రకాలను సాగుకు ఎంపిక చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రకృతి వ్యవసాయ పిఎండిఎస్ కిట్లు, పెలటైజేషన్ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. పంటల బీమా చేసుకునేందుకు ఆగస్టు 15 చివరి గడువు కావడంతో రైతులు తమ రుణ బ్యాంకులు లేదా మీ సేవ కేంద్రాల్లో వెంటనే పంట బీమా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది రామకృష్ణ, ప్రియాంక, ఉసేనమ్మ, ఓంకారేశ్వర దేవస్థానం చైర్మన్ చెన్నారెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

# కొత్తూరు సుబ్బరాయుడు సన్నిధిలో ఎస్పీ దంపతులు ప్రత్యేక పూజలు..



పాణ్యం ఆగస్టు 12 పల్లె వెలుగు : మండలం పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన ప్రముఖ శైవ క్షేత్రం శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం సన్నిధిలో సీఐ విజయలక్ష్మి,ఎస్పై నరేంద్ర కుమార్ రెడ్డి దంపతులు బుధవారం పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సురేష్ శర్మ ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. ఆషాఢ మాస అమావాస్యను పురస్కరించుకుని అభిషేకములు, అర్చనలు ,విశేష పూజలు నిర్వహించారు. అనంతరం దంపతులు ఇద్దరికీ పూలమాలతో, శేష వస్త్రములతో ఘనంగా సత్కరించి, స్వామి వారి తీర్థ ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు,గ్రామ పెద్దలు మిలటరీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని: రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ సాయం!

- గడివేముల--నంద్యాల రహదారిపై కొరటమద్ది వద్ద ఘోర ప్రమాదం
- ఆర్‌టీసీ బస్సును తీవ్రస్థాయిలో ఢీకొట్టిన కోళ్ల బొలెరో వాహనం
- కాన్వాయ్ ఆపి, క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించిన వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో గడివేముల-- నంద్యాల ప్రధాన రహదారిపై కొరటమద్ది గ్రామ సమీపంలో బుధవారం ఉదయం భయానక రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా దూసుకొచ్చిన కోళ్ల లోడు బొలెరో వాహనం ఎదురుగా వస్తున్న ఆర్‌టీసీ బస్సును బలంగా ఢీకొట్టింది. ఈ తీవ్ర ఘాతానికి బొలెరో ముందుభాగం నుజ్జునుజ్జవగా, పలువురు ప్రయాణికులు తీవ్ర గాయాలపాలై రక్తమడుగులో చిక్కుకున్నారు.
సమయస్ఫూర్తితో కాన్వాయ్ నిలిపి సహాయక చర్యలు:సరిగ్గా అదే సమయంలో ఆ మార్గంలో ప్రయాణిస్తున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ప్రమాదాన్ని గమనించి వెంటనే తన కాన్వాయ్‌ను నిలిపివేశారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా ప్రమాద స్థలానికి చేరుకుని, గాయపడి ఆర్తనాదాలు చేస్తున్న క్షతగాత్రుల వద్దకు వెళ్లి వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. స్వయంగా 108 అత్యవసర అంబులెన్స్ సర్వీసుకు ఫోన్ చేసి, వాహనాలను వెంటనే రప్పించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించే వరకు దగ్గరుండి సహాయక చర్యలను పర్యవేక్షించారు.
స్థానికులు, బాధితుల ప్రశంసలు:
ఆపద సమయంలో అత్యంత సమయస్ఫూర్తితో స్పందించి ప్రాణాపాయం తప్పించిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ఉదారతకు, మానవతా దృక్పథానికి స్థానికులు, ప్రమాద బాధితులు మరియు వారి కుటుంబ సభ్యులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# వాల్మీకి ఆలయ సమస్యల పరిష్కారం పై స్పందించిన ఎమ్మెల్యే గౌరు చరితమ్మకు ధన్యవాదాలు : గుజ్జుల గౌరీశ్వర్ నాయుడు.

నందికొట్కూరు ఆగష్టు 12 కేతవరం గ్రామం లో మహర్షి వాల్మీకి ఆలయ సమస్యలపై పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితమ్మ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది అని స్పందనగా ఆమె బుధవారం గ్రామంలో వాల్మీకి ప్రజలతో కలిసి పర్యటించి ఆలయాన్ని సందర్శించి పరిశీలించడం , సమస్యల పరిష్కారానికి కృషి చేయడం ఎంతో సంతోషదాయకమని ఆమెకు వాల్మీకి ప్రజల తరఫున వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుజ్జుల గౌరీశ్వర్ నాయుడు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజుల క్రితం కేతవరం గ్రామంలో మహర్షి వాల్మీకి ఆలయ ప్రహరీ గోడ సమస్య, శాశ్వత పట్టా, స్థానిక ప్రజల సమస్యలపై విన్నవించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్యలపై ఎమ్మెల్యే గౌరు చరితమ్మ స్పందించడం, ఆలయ ప్రహరి కోట నిర్మాణానికి అనుమతులు కల్పించడం, శాశ్వత పట్టా మంజూరు చేయడం అభినందించదగిన విషయం అన్నారు. వాల్మీకి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించే అధికారులతో మాట్లాడి పరిష్కారాన్ని కృషి కి చూపిన చొరవ హర్షించదగిన విషయమని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే చొరవతో ఆలయ అభివృద్ధి జరిగి, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రావాలని స్వామి వారి ఆశీస్సులు ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఓర్వకల్ మండల తెలుగుదేశం పార్టీ నాయకులు నాగిరెడ్డి, స్థానిక నాయకులు మాజీ సర్పంచ్ బోయ గోవర్ధన్, బోయ కృష్ణ, బోయ వెంకటేశ్వర్లు, బోయ శ్రీను, వెంకట్,సాయి, గ్రామ వాల్మీకి ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ తెలుగుదేశం

## కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి..



పాణ్యం ఆగస్టు 12 పల్లె వెలుగు : తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి బుధవారం మండలంలోని పిన్నాపురం, సుగాలి మెట్ట గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు.స్థానిక నాయకులతో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్లారు.ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఏ మేరకు అందుతున్నాయనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.గ్రామాలలో ఉన్న ప్రజలకు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.కూటమి ప్రభుత్వం రాష్ట్రం అభివృద్ధి వైపు వెళ్తూ సమస్యల చీకట్లను దాటుకుని, నవ్యాంధ్ర ప్రగతి కాంతుల వైపు అడుగులు వేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పాలనా లోపాలు,నిర్లక్ష్యంతో రాష్ట్రం ఎంతటి అధోగతి పాలైందో మనమందరం చూశాం. కనీసం రహదారులపై పడిన చిన్న గుంతలను కూడా పూడ్చలేని దయనీయ స్థితికి రాష్ట్రాన్ని నెట్టివేశారు.రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకోవాల్సిన పరిస్థితి. చినుకు పడితే జలమయమయ్యే గుంతలు, నిత్యం జరిగే ప్రమాదాలు, విరిగిన వాహనాలు, వాహనదారుల ఆవేదన.ఇవే గత ఐదేళ్ల సంక్షోభ పాలనకు పరాకాష్ట.కూటమి ప్రభుత్వ రాష్ట్రాన్ని పునర్నిర్మించే సంకల్పంతో అధికారంలోకి వచ్చింది మన కూటమి ప్రభుత్వం.అధికారం చేపట్టిన వెంటనే శ్వేతపత్రాలు విడుదల చేసి,వాస్తవ పరిస్థితులను ప్రజల ముందుంచడమే కాకుండా.తక్షణ కార్యాచరణ ప్రారంభించింది.అభివృద్ధి బాటలో వెళ్తు గుంతల రహిత రోడ్ల' కార్యక్రమాన్ని ప్రారంభించి,వేల కిలోమీటర్ల రహదారులను యుద్ధప్రాతిపదికన పునర్నిర్మిస్తున్నారు. మౌలిక వసతుల పునరుద్ధరణ పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను వేగవంతం చేస్తూ,మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయించి పనులు వేగవంతంగా జరిపిస్తున్నామని ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జయరాం రెడ్డి,లాయర్ బాబు,ఎంపీటీసీ రంగ రమేష్ ఇతర గ్రామాల నాయకులు, కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్యశాఖ పనితీరుపై సమీక్షించిన జిల్లా కలెక్టర్.

☛పీహెచ్సీ కేంద్రాలలో వైద్య సేవలను మరింత మెరుగుపరచాలి.

☛ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి: జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. పీహెచ్సీ కేంద్రాలలో వైద్య సేవలను మరింత మెరుగుపరచాలనీ జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా వైద్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లాలో పిహెచ్సి కేంద్రాల ద్వారా అందుతున్న సేవలపై



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ తో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పీహెచ్సీ కేంద్రాలలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. పిహెచ్సి సెంటర్లో వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన మందులు వైద్య పరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఆసుపత్రి ఆవరణలో పరిశుభ్రత, మౌలిక వసతులు, రోగి నిర్ధారణ పరీక్షలు, ఇతర అత్యవసర వైద్య సేవలను మెరుగుపరచాలని సూచించారు. వివిధ ఆరోగ్య కార్యక్రమాలలో జిల్లాల్లో సాధించిన పురోగతి లక్ష్యాల సాధన వెనుకబడిన సూచికలు మరియు క్షేత్రస్థాయి పనితీరును మెరుగుపరచాలన్నారు. కె.పి.ఐ నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో సాధించేలా సంబంధిత అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు. ఆరోగ్య శాఖకు సంబంధించిన సూచికలు, లక్ష్యాలపై క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహించి, వెనుకబడిన అంశాల్లో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, సంబంధిత వైద్యాధికారులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పేదలందరికీ 3 సెంట్ల స్థలం.. రూ.5 లక్షల సాయం అందించాలి



మహానంది, పల్లె వెలుగు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి 3 సెంట్ల ఇంటి స్థలంతో పాటు నిర్మించుకోవడానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు పేర్కొన్నారు. బుధవారం మహానంది మండలంలోని మహానంది, అల్లినగరం, శ్రీనగరం, బుక్కాపురం, తిమ్మాపురం,పలు గ్రామాల్లో సీపీఐ మండల కార్యదర్శి సామెల్ ఆధ్వర్యంలో మార్పు కోసం సీపీఐ ప్రచార పాదయాత్ర నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ... రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ అసమర్థ, నిరంకుశ పాలన వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యలు తాండవిస్తున్నాయన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిగా గాలికి వదిలేసి నిరుపేద ప్రజలను తీవ్రంగా దగా చేస్తున్నారని విమర్శించారు. చదువుకున్న వారికి ఉద్యోగం రాకపోతే నిరుద్యోగ భృతి ఇస్తానన్న నారా చంద్రబాబు నాయుడు ఇప్పటివరకు దానిపై స్పందించలేదన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయకపోతే అధికారులను, ప్రజాప్రతినిధులను రోడ్లపై నిలదీస్తామని హెచ్చరించారు.ఈ ప్రజా సమస్యలపై ఈనెల 17వ తేదీన తలపెట్టిన 'ఛలో కలెక్టరేట్' కార్యక్రమాన్ని నిరుపేదలు, ప్రజాసంఘాల నాయకులు, కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగ రాముడు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, సహాయ కార్యదర్శి రాజు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రజిత, లక్ష్మి దేవి, హరినాథ్, రాజేశ్వరయ్య, మధు, లక్ష్మణ్, దస్తగిరి, తుపాకుల వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవి, లక్ష్మయ్య, బలరాముడు, జయన్న, జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న రాకకు వైఎస్సార్‌సీపీ సమర శంఖం: కర్నూలు గడ్డపై భారీ ఏర్పాట్లు!

**● వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రేపటి పర్యటనపై పాణ్యంలో అత్యున్నత స్థాయి సమావేశం ● మాజీ ఎమ్మెల్యే కాటసాని నివాసంలో భేటీ అయిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం ● జనసమీకరణ, పర్యటన విజయవంతంపై నేతల దిశానిర్దేశం ● అభిమానులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపు**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కర్నూలు పర్యటన నేపథ్యంలో జిల్లా రాజకీయం తీవ్ర వేడెక్కింది. అధినేత రాకను పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ శ్రేణులు సమరశంఖం పూరించాయి. పర్యటన ఏర్పాట్లను వేగవంతం చేయడంలో భాగంగా పాణ్యం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రామభూపాల్ రెడ్డి నివాసంలో బుధవారం కీలక సమావేశం నిర్వహించారు.

**ఎంబీసి స్థాయిలో వ్యూహాత్మక చర్చలు:**

ఈ ముఖ్య సమావేశానికి రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పార్టీ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం ముఖ్య అతిథులుగా విచ్చేశారు. కాటసాని రామభూపాల్



రెడ్డితో కలిసి జగనన్న పర్యటనకు సంబంధించిన రూట్ మ్యాప్, భద్రతా ఏర్పాట్లు, సభ నిర్వహణ, మరియు నియోజకవర్గాల వారీగా జనసమీకరణపై సుదీర్ఘంగా చర్చించారు. పర్యటనను చారిత్రాత్మక విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై నేతలకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

**జనసంద్రంగా మారనున్న కర్నూలు:**

ఈ సందర్భంగా సీనియర్ నేతలు మాట్లాడుతూ--- ప్రియతమ నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు కర్నూలు జిల్లా సిద్ధమైందని స్పష్టం చేశారు. పార్టీ పట్ల జనుల్లో ఉన్న అభిమానం పునాదిగా, ఈ పర్యటనతో వైఎస్సార్‌సీపీ తన బలాన్ని మరోసారి చాటుకోనుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల నలుమూలల నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు మరియు ప్రజలు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# జాతర లా చౌడేశ్వరి జన్మదినం

బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 12: బండి





ఆత్మకూరులో వెలసిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారి జన్మదినం జాతరను తలపింపజేసే విధంగా నిర్వహించారు. నంద్యాల జిల్లా వైఎస్ఆర్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు రాజం రెడ్డి సుజాతమ్మ ఆధ్వర్యంలో ఆమె కూతురు మాధవి, కుటుంబీకులు, తొగట వీర క్షత్రియ సంఘం వారి నిర్వహణలో అమ్మవారి జన్మదిన వేడుకలను నిర్వహించారు. బుధవారం ఉదయమే ఆలయ పూజారి వెంకట చౌడయ్య అమ్మవారిని అందంగా అలంకరించారు. సుజాతమ్మ కూతురు మాధవి గత ఏడాది పది లక్షల రూపాయలతో తయారుచేసిన వెండి తొడుగును అమ్మవారికి అలంకరించి పూలదండలతో ముస్తాబు చేశారు. ఉదయం 10 గంటల నుండి గ్రామంలోని కొత్తకోట కాలనీ నుండి అమ్మవారిని ప్రత్యేక పల్లకిలో ఊరేగించారు. కోలాటాల సందళ్ల మధ్య మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వాసవి వనిత క్లబ్ క్యాబినెట్ సెక్రటరీ అడ్మిన్ గుండా సునీత, వాసవి క్లబ్ మండల ప్రెసిడెంట్ గుండా లక్ష్మీదేవి కార్యదర్శి భార్గవి, ఇలా ఒకరని ఏమిటి, కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల వారు వయసుతో సంబంధం లేకుండా ఉత్సాహంగా ఉల్లాసంగా కోలాటం కార్యక్రమంలో పాల్గొన్న సంఘటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమ్మవారి కీర్తనలను స్తుతిస్తూ, ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారికి చీర,సారేలతో పాటు నైవేద్యాలను సమర్పించారు. టెంకాయలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలను నిర్వహించారు. గ్రామ రక్షణ,వర్షాలు సమృద్ధిగా



కురియాలని,పంటలు బాగా పండాలని కుటుంబాలు శాంతియుతంగా జీవించాలని మహిళలు అమ్మవారిని ప్రార్థించారు ఈ సందర్భంగా ఆలయంలో ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొగట వీర క్షత్రియ సంఘం యువకులు, జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు అయితా శేఖర్ అన్నదాన కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. చౌడమ్మ తల్లి అంటే ఊరికి కాపలా దేవత అనే నమ్మకం ప్రజలలో ఉంది. చౌడేశ్వరి శక్తి స్వరూపిణి అయినా, ఆమెను ఊరి కూతురుగా భక్తులు భావిస్తారు. గ్రామదేవత కాబట్టి ఆడపిల్లగా భావించడంతోపాటు ఊరికి కాపలాగా తల్లిలా అక్కలా, ఊరిని కాపాడుతూ ఉంటుందని కూడా భక్తులు నమ్ముతారు. భక్తుల కోర్కెలను నెరవేర్చే తల్లి చౌడేశ్వరి అని నమ్ముతూ ప్రతి ఏటా అమ్మవారి జన్మదిన వేడుకలను బండి ఆత్మకూరులో నిర్వహిస్తూ ఉండటం సర్వ సాధారణంగా జరుగుతూ ఉంది. గ్రామంలో జరిగిన చౌడేశ్వరి అమ్మవారి జన్మదినం వేడుకలను భక్తులు తిలకించి పునీతులయ్యారు.

# ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మెరుగైన వైద్య సేవలకు పటిష్ట చర్యలు.

**క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. బుధవారం ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్, వైద్య బృందంతో కలిసి ఆసుపత్రిలో నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ యూనిట్ పనులను కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్రిటికల్ కేర్ యూనిట్‌లో మొదటి అంతస్తు నిర్మాణ పనులు పూర్తయ్యాయని, రెండో అంతస్తు నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సి సి యు అందుబాటులోకి వచ్చిన అనంతరం అత్యవసర, తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అలాగే ఆసుపత్రిలో అన్ని రకాల ఆపరేషన్ థియేటర్లను అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రిలో గతంలో ఉన్న నీటి ఎద్దడి సమస్యను సంప్ నిర్మాణం ద్వారా పరిష్కరించామని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం అన్ని వార్డులకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరాయంగా నీటి సరఫరా జరుగుతోందని తెలిపారు.

రోగులకు ప్రభుత్వం అందిస్తున్న ఆహారం నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. గైనకాలజీ వార్డులోని రోగులకు హై-ప్రోటీన్ డైట్, ఇతర రోగులకు సాధారణ డైట్, విధుల్లో ఉన్న వైద్యులకు అవసరమైన ఆహారాన్ని ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. రోగులకు నాణ్యమైన ఆహారం అందుతున్నదీ లేనిదీ నిర్ధారించేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన వైద్య విభాగం, సేవలపై సరైన సమాచారం అందించేందుకు హెల్ప్ డెస్క్ సేవలను మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ సూచించారు. రోగులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అర్హులైన ప్రతి రోగికి ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా ఉచిత వైద్య చికిత్స అందేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఐసీయూ లో చికిత్స పొందుతున్న రోగుల బంధువులు ఆందోళనకు గురయ్యే అవకాశం ఉన్నందున, వారితో సిబ్బంది సౌమ్యంగా, ఓర్పుతో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. రోగుల బంధువులకు పరిస్థితిని స్పష్టంగా వివరించి, వారికి అవసరమైన సమాచారం అందించేలా సిబ్బందికి క్రమం తప్పకుండా ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వైద్య సేవల నాణ్యత, పరిశుభ్రత, మౌలిక వసతులు, రోగుల సౌకర్యాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి స్పష్టం చేశారు.

# స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

## -- మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్.








పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని దేశ స్వేచ్ఛ కోసం పోరాడిన వీరుల అపూర్వ త్యాగాలను నేటి తరానికి పరిచయం చేయాలనే లక్ష్యంతో నంద్యాల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ , ఆల్ మైనారిటీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ -- ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో, ఎం బి టి ఫౌండేషన్ సహకారంతో నంద్యాలలోని ఆర్.కె. ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న రెండు రోజుల స్వాతంత్ర్య సమరయోధుల అరుదైన ఫోటో ఎగ్జిబిషన్ బుధవారం రెండవ రోజు కూడా విశేష స్పందనతో కొనసాగింది.

రెండవ రోజు ప్రదర్శనను ఆంధ్రప్రదేశ్ న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ సందర్శించారు, ప్రదర్శనలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధుల అరుదైన చిత్రాలను చరిత్రకారులు నశిర్ అహమద్ మంత్రి కి వివరించగా ఆసక్తిగా తిలకించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో వివిధ వర్గాలకు చెందిన మహనీయులు చేసిన త్యాగాలను చిత్రాల రూపంలో నేటి తరానికి తెలియజేస్తున్న నిర్వాహకుల కృషిని, ఈ కార్యక్రమానికి ఆర్థిక సహాయం చేసి స్పాన్సరర్ గా ఉన్న ఎం బి టి బాబు ని ఆయన అభినందించారు.

ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం అనేకమంది మహనీయుల త్యాగాలు, పోరాటాలు, బలిదానాల ఫలితమని, వారి చరిత్రను ముఖ్యంగా యువతరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తన తండ్రి ఇబ్రహీం ఖలీల్ కూడా స్వాతంత్ర్య సమరయోధుడేనని గుర్తుచేసుకుంటూ, స్వాతంత్ర్య పోరాటంతో తన కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని స్మరించుకున్నారు.

ముస్లిం సమాజంలో, ముఖ్యంగా మహిళలు విద్యారంగంలో మరింతగా ముందుకు రావాలని మంత్రి ఆకాంక్షించారు. ముస్లిం మహిళలు పోటీ పరీక్షల్లో ఇతరులతో సమానంగా పోటీపడి ఉన్నత స్థానాలకు చేరుకోవాలనే ఉద్దేశంతో కంప్యూటర్లు, పోటీ పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను ప్రభుత్వ మరియు ప్రైవేట్ విద్యాసంస్థలకు అందజేసినట్లు ఆయన తెలిపారు. విద్య, నైపుణ్యం, పోటీ పరీక్షలపై అవగాహన ద్వారా యువతకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.

కార్యక్రమంలో క్రిస్టియన్ జేఏసీకి చెందిన పాస్టర్ జానామయ్య, ఉర్దూ డీఐ శ్రీ హస్మద్దీన్, ఎక్స్ ఆర్మీ జవాన్ల సంఘం అధ్యక్షులు శ్రీ రంగనాయకులు తదితర ప్రముఖులు పాల్గొని ఫోటో ప్రదర్శనను సందర్శించారు. దేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రను భావితరాలకు అందించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం జాతీయ సమైక్యత, మత సామరస్యం మరియు దేశభక్తి భావాలను పెంపొందించేందుకు దోహదపడుతుందని వారు అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు మంత్రి శ్రీ ఎన్.ఎం.డి. ఫరూక్ ని, సూఫీ సాహెబ్ (ఎం బి టి బాబు)ని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అదేవిధంగా ఈ రెండు రోజుల ఫోటో ఎగ్జిబిషన్ విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన కార్యకర్తలు, సహకరించిన ప్రముఖులను కూడా మంత్రి ఫరూక్ చేతుల మీదుగా శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

ప్రముఖ రచయిత, చరిత్ర పరిశోధకులు నసీర్ అహ్మద్ సేకరించిన స్వాతంత్ర్య సమరయోధుల అరుదైన చిత్రాలతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన ద్వారా స్వాతంత్ర్య ఉద్యమంలో మరుగునపడిన అనేకమంది వీరుల చరిత్రను ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులు మరియు యువతకు పరిచయం చేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

"స్వాతంత్ర్యం మనకు వారసత్వంగా లభించిన సాధారణ హక్కు కాదు; ఎందరో మహనీయుల రక్తం, త్యాగం, పోరాటాల ఫలితం. వారి చరిత్రను నేటి తరానికి అందించడం వారిపట్ల మనం చూపే నిజమైన గౌరవం" అని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎన్ఎంజేఏసీ గౌరవ అధ్యక్షులు ఎస్. మహమ్మద్ అబులైస్, కన్వీనర్ మౌలానా అబ్దుల్లా రషాదీ, ఆల్ మేవా ఏపీ రాష్ట్ర అధ్యక్షులు ఇంజి. సయ్యద్ ఇమ్రాన్ పాషా, జాకీఉల్లా జేఏసీ యువ నాయకులు, అన్సర్ బాష వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా అబ్దుల్ సమద్ జేఐహెచ్ తదితరులు పాల్గొన్నారు, వివిధ సామాజిక, మత, ప్రజాసంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, విద్యార్థులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన కోట్ల రాఘవేంద్ర రెడ్డి

**☛తెలుగుదేశం పార్టీ కార్యకర్త వడ్డే పెద్దన మృతి పట్ల సంతాపం**

**☛మాజీ సర్పంచ్ తోప్పెల చెన్నయ్య కుటుంబానికి పరామర్శ**





పల్లె వెలుగు -ప్యాపిలి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తల కుటుంబాల్లో వెల్లువెత్తిన విషాదంలో వారి కుటుంబ సభ్యులకు పార్టీ యువ నాయకులు కోట్ల రాఘవేంద్ర రెడ్డి అండగా నిలిచారు. బుధవారం ఆయన పలు బాధిత కుటుంబాలను పరామర్శించి, నివాళులర్పించారు.

ప్యాపిలి పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త వడ్డే పెద్దన్న మరణించారనే వార్త పట్ల కోట్ల రాఘవేంద్ర రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంటనే పెద్దన నివాసానికి చేరుకుని, ఆయన మృతదేహానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబానికి భగవంతుడు ధైర్యం కలగజేయాలని, మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

**మాజీ సర్పంచ్ తోప్పెల చెన్నయ్య కుటుంబానికి పరామర్శ:**

అలాగే, ఇటీవల పరమపదించిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ తోప్పెల శ్రీనివాసులు తండ్రి, మాజీ సర్పంచ్ తోప్పెల చెన్నయ్య నివాసానికి కోట్ల రాఘవేంద్ర రెడ్డి వెళ్లారు. ఇటీవల జరిగిన అంత్యక్రియలకు అనివార్య కారణాలవల్ల హాజరు కాలేకపోవడంతో, నేరుగా వారి ఇంటికి వెళ్లి శ్రీనివాసులు, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చెన్నయ్య గారి మృతికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో రాజా నారాయణమూర్తి, ఖాజాపీర్, కమతం భాస్కర్ రెడ్డి, రమేష్ గౌడ్, రాంమోహన్ యాదవ్, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలు

**జెండావిష్కరణ చేసిన ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భార్గవ్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ చక్రవర్తి.**



బేతంచెర్ల పల్లె వెలుగు ప్రతినిధి (ఆగస్టు 12 ) బేతంచెర్ల పట్టణంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఉదయ్ అధ్యక్షతన ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శేషారెడ్డి హైస్కూల్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భార్గవ్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ చక్రవర్తి హాజరై ఉమ్మడిగా ఏఐఎస్ఎఫ్ జండా ఆవిష్కరణ చేసి అనంతరం వారు మాట్లాడుతూ 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో మహానగరంలో బెనారస్ విశ్వవిద్యాలయంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ దేశంలో మొట్టమొదటి విద్యార్థి సంఘం గా ఆవిర్భవించిందని నాటి నుంచి నేటి వరకు విరోచిత పోరాటాలు నిర్వహించి అనేకమంది విద్యార్థి నాయకులను బలిదానాలు చేసిందని, ప్రస్తుతం దేశంలో నూతన విద్యా విధానం పేరుతో విద్యను పూర్తిగా కాషాయికరణగా మార్చే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్ర పడిందని, దేశ స్వాతంత్రం కోసం పోరాడిన సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ చరిత్రను పాఠ్యాంశాలుగా చేర్చాలని డిమాండ్ చేశారు, జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విలీనాన్ని తక్షణమే ఆపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు, తక్షణమే జీవో నెంబర్ 77కు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ,అధ్యాపక ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యల పైన పోరుబాటు సాగించాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వమే పాఠ్యపుస్తకాలు అందించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు బడ్జెట్లో 50% నిధులు కేటాయించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించకుండా పేద విద్యార్థులకు విద్యను దూరం చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలనిడిమాండ్ చేశారు, పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలు 10700 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ టి ఏ ను రద్దుచేసి నీట్ పేపర్ నిర్వహణ రాష్ట్రాలకే అప్పగించాలని డిమాండ్ చేశారు.పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ చక్రవర్తి గారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యారంగంలో వస్తున్న మార్పుల గమనించాలని అన్నారు , జిల్లా కోశాధికారి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ 91వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాల పైన పోరాటాలకు సిద్ధం కావాలని విద్యార్థి నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు, అనంతరం 91వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు దస్తగిరి తిరుమలేష్ ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు శ్రీకర్, మధు, గౌరి ఉదయ్,భాస్కర్ దేవరాజు, హమీద్ ,మహబూబ్, కిషోర్ ,సురేష్ , సుదర్శన్, ప్రసాద్, అస్లామ్ , బాలు, గోపి,ప్రవీణ్,మధుతేజ మరియు అధిక సంఖ్యలో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

# హెచ్ఐవీపై విద్యార్థులకు అవగాహన.






పల్లె వెలుగు మహానంది. మహానంది మండలం, గోపవరం గ్రామం ఏపీ సాక్స్ మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దిశ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఐవీ/ఎయిడ్స్ మరియు లైంగిక వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సి ఎల్ డబ్ల్యూ మాట్లాడుతూ, యువత హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండటం ద్వారా సంక్రమణను నివారించవచ్చని తెలిపారు. హెచ్ఐవీ అసురక్షిత లైంగిక సంబంధాలు, తల్లి నుంచి బిడ్డకు, కలుషితమైన సూదులు/సిరంజీలు మరియు పరీక్షించని రక్తం ద్వారా సంక్రమించే అవకాశం ఉందని వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో హెచ్ఐవీ పరీక్షలు ఉచితంగా, గోప్యంగా అందుబాటులో ఉన్నాయని, పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వారికి ఏ ఆర్ టి/లింకు ఏ ఆర్ టి కేంద్రాల ద్వారా ఉచితంగా చికిత్స అందుతుందని తెలిపారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వారిపై వివక్ష చూపకూడదని, సందేహాల నివృత్తికి 1097 హెల్ప్‌లైన్ను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సి ఎల్ డబ్ల్యూ శకుంతల మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# దొర్నిపాడు లో ఘనంగా

## శ్రీ చౌడేశ్వరిదేవిఅమ్మవారిజయంతి వేడుకలు.

**భారీగా పాల్గొన్న మహిళలు**





దొర్నిపాడు ఆగస్టు 12 పల్లె వెలుగు న్యూస్ దొర్నిపాడు మండల కేంద్రంలో కొలువై ఉన్న ఆది పరా శక్తి స్వరూప మైనశ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారిజయంతి వేడుకలు బుధవారం గ్రామానికి చెందిన నాయిని గారి బ్రదర్స్, నీలిబ్రదర్స్ వారి అద్వర్యంలో గ్రామ ప్రజల సహాయ సహకారాలతోసనాతన ఆచార సాంప్రదాయాల ప్రకారం అమ్మవారిజన్మదినవేడుకలనుఘనంగనిర్వహించారు,అమ్మవారికి ఉదయం వేద మంత్రాలతో అభిషేకాలుపూజలుజరిగాయి.అమ్మవారి జయంతి వేడుకలలో మహిళలు పెద్దఎత్తున పాల్గొని పూజలు చేశారు, పూజల అనంతరముఅమ్మవారి జయంతి సందర్భంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలోభాగంగాప్రజలకుఅన్నదానకార్యక్రమాన్ని నాయిని గారిబ్రదర్స్, నీలి బ్రదర్స్ కుటుంబాలుకలసి నిర్వహించారు.ఘనంగా జరుగుతున్నచౌడేశ్వరి దేవి అమ్మవారి కి ఆలయ భూములు ఉండి ఆదాయంవస్తున్న గ్రామంలో అమ్మవారికి జరుగుతున్న జయంతి వేడుకల కార్యక్రమాలకుఆలయ ఈ ఓ కాని,దేవాదాయఇతరఎక్సక్యూటివ్ సిబ్బందికాని హాజరు కాకపోవడంఆంతర్యంఏమిటనిప్రజలుచర్చించుకుంటున్నారు,టీడీపీనాయకుడు నాయిని గారి శ్రీనివాసులు మాట్లాడుతూ దగ్గర ఉండి నిర్వహించాల్సిన పవిత్ర కార్యక్రమాలకు ఆలయ అధికారులు రాకపోవడం ఆలయ మర్యాదల ఉల్లంఘన అని అన్నారు. ఈ విషయం ఉన్నత అధికారుల దృష్టికి తీసుకొని వెలుతాను అని అన్నారు,ఈకార్యక్రమంలోమహిళలు, గ్రామ ప్రజలు ,భక్తులు, పాల్గొన్నారు

# యువతే దేశ ప్రగతికి అసలైన వెన్నముక





ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 12 పల్లె వెలుగు అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఆళ్లగడ్డ పట్టణంలోని టీఎస్ బ్రదర్స్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నాడు " ఆస్క్ అఖిల "పేరుతో నిర్వహించిన ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ముఖ్య అతిథిగా పాల్గొని, వివిధ కళాశాలల విద్యార్థులతో నేరుగా ముచ్చటించారు. విద్య, ఉద్యోగ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి మరియు ఉన్నత చదువులపై విద్యార్థులు అడిగిన పలు కీలక ప్రశ్నలకు ఆమె ఓపికగా సమాధానమిచ్చి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. నియోజకవర్గ యువతకు అన్ని వేళలా అండగా ఉంటామని, యువతే దేశ ప్రగతికి అసలైన వెన్నెముక అని కొనియాడుతూ, ప్రతి విద్యార్థి జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని, ఆ లక్ష్య సాధన కోసం దీక్ష, పట్టుదలతో చదివి విభిన్న నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల ఆలోచనలను నేరుగా తెలుసుకుని, వారి ఉజ్వల భవిష్యత్తు నిర్మాణానికి తగిన సహకారం అందించడమే ఈ " ఆస్క్ అఖిల "కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అనంత విద్యాసంస్థల అధినేత అనంతరామ సుబ్బారెడ్డి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# సోలార్ బాధిత రైతులందరూ గుత్తిలో జరుగు రాష్ట్ర సదస్సు జయప్రదం చేయండి



పల్లె వెలుగు బేతంచెర్ల( ఆగస్టు 12 ):-- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక, సోలార్ కంపెనీల అనుకూల విధానాలపై, రైతులతో అవగాహన కల్పించేందుకు 14/8/2026 శుక్రవారం ఉదయం 10గంటలకు గుత్తి పట్టణం లోని పెద్ద శాదీ ఖానా ఫంక్షన్ హాలులో, సోలార్ రైతుల రాష్ట్ర సదస్సు జరుగుతుందని రైతు సంఘం బేతంచెర్ల మండల గౌరాధ్యక్షులు నీలి వెంకట కృష్ణా రెడ్డి,సిఐటీయు మండల కార్యదర్శి ఎస్. రహంతుల్లా బుధవారం బేతంచెర్ల మండలం ఆర్ఎస్.రంగాపురం గ్రామంలో రైతులకు తెలియజేస్తు,కరపత్రాలు పంపిణీ చేశారు. రైతులు వెంకట సుబ్బయ్య, బంకు కృష్ణా రెడ్డి,మధు,పి.నారాయణ రెడ్డి రాంబాబు,జె.మహమ్మద్ రఫి తదితరులు పాల్గొన్నారు.

# నేర నియంత్రణ , ప్రజల భద్రతే లక్ష్యం.

**-రాత్రి వేళల్లో కొనసాగుతున్న విజిబుల్ పోలీసింగ్ .**

పల్లెవెలుగు కర్నూలు క్రైమ్.కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ వారి ఆదేశాల మేరకు కర్నూలు జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం 'విజిబుల్ పోలీసింగ్' కార్యక్రమాన్ని విస్తృతంగా కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా నేరాల నియంత్రణకు అనుమానాస్పద వాహనాలను తనిఖీలు చేపడు తున్నారు. అనుమానస్పద వ్య క్తుల వేలిముద్రలను సేకరిస్తు న్నారు. కర్నూలు, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని సబ్ డివిజన్ లలో విజిబుల్ పోలీసింగ్ చేప ట్టారు. కర్నూలు నగరంలో కర్నూ ల్ తాలూకా సిఐ తేజ మూర్తి ఆధ్వర్యంలో బ్లూ కోల్ట్స్ బృం దాలు, క్యూఆర్టీ పోలీసు బృందాలు పాల్గొని కట్టుదిట్టంగా విజి బుల్ పోలీసింగ్ చేపట్టారు. డ్రంక్ డ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. రహదారి ప్రమాదాల నివారణకు "స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమం నిర్వహి స్తున్నారు.ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వా లని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు డయల్ 112 కు గాని లేదా డయల్ 100కు గాని సమాచారం ఇవ్వాలని సూచించారు



# పేద మహిళ వివాహానికి ఆర్థిక సహాయం అందించిన 38వ వార్డు టీడీపీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణంలోని స్థానిక 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ నందు నివాసం ఉంటున్న లింగం వేదమ్మ,లింగం థామస్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు కలరు. పెద్ద కుమార్తె అంజలి వివాహానికి రాష్ట్ర న్యాయ,మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి.ఫరూక్, వారి కుమారులు ఎన్ ఎం డి.ఫిరోజ్, ఎన్ ఎం డి.ఫయాజ్ పర్య వేక్షణలో వార్డు టీడీపీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు తనవంతు సహాయంగా 5000/-రూపాయలు నగదు వేదమ్మ,థామస్ దంపతులకుఇవ్వడం జరిగింది.అందుకు గాను వేదమ్మ,థామస్ దంపతులు బుగ్గరాముడు కి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భముగా బుగ్గరాముడు మాట్లాడుతూ ఇప్పటికీ దాదాపుగా వార్డు నందు 36 ఆడబిడ్డల వివాహాలకు తన వంతుగా ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందని ఆయన అన్నారు.

# మున్సిపల్ స్థలాల ఆక్రమణలపై ఉక్కుపాదం

- కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు
- కండేరి మున్సిపల్ క్వార్టర్స్‌లో ఆక్రమణల తొలగింపు



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు నగరంలోని మున్సిపల్ స్థలాలను ఆక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు స్పష్టం చేశారు. మున్సిపల్ ఆస్తులను పరిరక్షించడంతో పాటు ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదన్నారు. బుధవారం కండేరి మున్సిపల్ క్వార్టర్స్‌లో ఆక్రమణకు గురైన 11 సెంట్ల మున్సిపల్ స్థలాన్ని పరిశీలించిన కమిషనర్, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఆక్రమణలను వెంటనే తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. దీంతో 12 మంది సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం ఆక్రమణలను తొలగించింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలోని మున్సిపల్ స్థలాలు, ఆస్తులను గుర్తించి వాటి పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, మున్సిపల్ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా, ఇతర అవసరాలకు వినియోగించినా నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆక్రమణల విషయంలో ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. మున్సిపల్ స్థలాలను ఆక్రమించినా, ఆక్రమణలకు ప్రయత్నించినా వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.అంతకుముందు 19వ వార్డు రాంప్రియ నగర్‌లో ఆక్రమణలు, రహదారికి సంబంధించిన పీజీఆర్ఎస్ ఫిర్యాదును పరిశీలించారు. ప్రధాన రహదారుల్లో పలుచోట్ల నిలువ ఉన్న వర్షపునీరు తొలగింపజేశారు. ఏపీఎచ్‌బీ కాలనీలో విద్యుత్ దీపాల సమస్యను, కలెక్టరేట్‌లోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగరాజు, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దివాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే పాదయాత్ర

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు**




పల్లె వెలుగు బేతంచెర్ల ప్రతినిధి (ఆగస్టు 12 ):-- ప్రజా సమస్యల పరిష్కారంలో రాష్ట్రంలో కుటుంబ ప్రభుత్వం, కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యాయని తక్షణమే ప్రజా సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఇంటికి సాగనంపే రోజులు దగ్గర పడ్డాయని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయుడు బుధవారం సిపిఐ చేపట్టిన పాదయాత్రలో ధ్వజమెత్తారు.ఆగస్టు 6 నుండి 15వ తేదీ వరకు జరుగుతున్న పాదయాత్ర ప్రచార ఆందోళనలో భాగంగా మండల సిపిఐకార్యదర్శి యన్న భార్గవ్ ఆధ్వర్యంలో పట్టణంలోని కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ మీదుగా రైల్వే గేట్ల వారికి సాగింది. ఈ ప్రచార కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం దశాబ్దపు కాలంగా దొంగ
ఓట్లతో అధికారం చేలాయిస్తుందని,ఈ మధ్యనే కేంద్రంలో జరిగిన జన్ జె నిరసనల్లో విద్యార్థులు చేపట్టిన నీట్ ఆందోళనలో మోడీ ప్రభుత్వం దిగి వచ్చి సంబంధిత విద్యాశాఖ మంత్రిని రాజీనామా చేయించే వరకు పోరాడారని, ఆ విద్యార్థుల ఉద్యమంలో మోడీ ప్రభుత్వం ఓటమికి పునాదులు పడ్డాయని, ఇకనుండి మోడీ ప్రభుత్వం ఆటలు సాగవని ఆయన ధ్వజమెత్తారు. వర్షాలు లేక విలవిల లాడుతున్న రైతన్నను
ఆదుకోవాలని పట్టణంలోని శివారు కాలనీలో సిసి రోడ్లు లైట్లు ఏర్పాటు చేయాలని, చేయాలని నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి వెంటనే మూడు వేల రూపాయలు మంజూరు చేయాలని, పేద ప్రజలకు పట్టణాల్లో రెండు సెంట్లు స్థలం,గ్రామాల్లో మూడు సెట్ల స్థలం మంజూరు చేయాలని డోన్ నియోజకవర్గంలో నిరంతరం గోరుకొల్లు ద్వారా మంచి నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ పాదయాత్ర లో సిపిఐ సహాయ కార్యదర్శి తిరుమలేష్,దస్తగిరి,పట్టణ కార్యదర్శి నాగరాజు ఎస్ టి యు జిల్లా కార్యదర్శి ఆజాంబెగ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, ఏఐటీయూసీ నాయకురాలు మహాలక్ష్మి నాగలక్ష్మి పుష్పవతి, సీనియర్ నాయకులు సంజీవుడు, బాలకృష్ణ శ్రీరాములు నాగేశ్వరావు మధు, భాస్కర్ గౌరీ ఉదయ్ దేవరాజు ప్రదీప్ హమీద్, మహబూబ్, ప్రవీణ్,శివ అధిక సంఖ్యలో యువకులు సానుభూతిపరులు పాల్గొన్నారు.

# మాజీ సీఎం జగన్ కర్నూలు పర్యటన: ములాఖాత్‌కే గ్రీన్ సిగ్నల్

**--ర్యాలీలు, రోడ్‌షోలకు నో పర్మిషన్:**
**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరిక**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో వైఎస్సార్ కాంగ్రెస్



పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి 13న (గురువారం) చేపడుతున్న కర్నూలు జిల్లా పర్యటనకు సంబంధించి పోలీసులు స్పష్టమైన సరిహద్దులు విధించారు. కేవలం 'ములాఖాత్' (సందర్శన)కు మాత్రమే అనుమతి మంజూరు చేశామని, ఎలాంటి ర్యాలీలు, రోడ్‌షోలు, బహిరంగ సభలకు అనుమతి లేదని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ స్పష్టం చేశారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో డీఎస్పీ రాఘవేంద్రతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పర్యటన భద్రతా వివరాలను వెల్లడించారు. ఆళగడ్డ శాసనసభ్యుడిని పరామర్శించే నిమిత్తం జగన్ వస్తున్నారని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి విన్నవించారని ఎస్పీ తెలిపారు. జగన్ కాన్వాయ్, జైలు ములాఖాత్ ప్రక్రియకు మాత్రమే రక్షణ కల్పించాలని విన్నవించడంతో దానికి అనుగుణంగానే బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. జగన్ పర్యటన ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి జాతీయ రహదారి మీదుగా 38 కిలోమీటర్లు సాగి పంచలింగాల వద్ద ఉన్న సబ్‌జైలుకు చేరుకుంటుందని వివరించారు.

**పోలీస్ శాఖ విధించిన నిబంధనలు:**


ర్యాలీలు, సభలపై పూర్తి నిషేధం: పర్యటన మార్గంలోగానీ, పరిసర ప్రాంతాల్లోగానీ ఎలాంటి గుంపులు కూడటం, ర్యాలీలు లేదా బహిరంగ సభలు నిర్వహించడం చట్టవిరుద్ధం.


30 పోలీస్ యాక్ట్ అమలు: జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున అనుమతి లేకుండా ప్రజలు, కార్యకర్తలు భారీగా సమకూరరాదు. కన్నుల నిఘా -- కెమెరాల పహారా: రూట్ మ్యాప్ అంతటా సీసీ కెమెరాలు, ప్రత్యేక వీడియో గ్రాఫర్లతో పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు.

రాకపోకలకు ఇబ్బంది కలగొద్దు: హైవే పరిధిలో విద్యాసంస్థలు, ఆసుపత్రులు ఉన్నందున సామాన్య ప్రజలకు, వాహనదారులకు భంగం కలగకూడదు. ఎమర్జెన్సీ సేవల కోసం ప్రత్యేక మెడికల్ టీమ్‌లను అందుబాటులో ఉంచారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే లేదా చట్టబద్ధమైన నిబంధనలను ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. నిబంధనలకు లోబడి పర్యటన పూర్తి చేసుకునేలా రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# టిడిపిని వీడి 20 మంది వైసీపీలో చేరిక





చాగలమర్రి ఆగస్టు 12 పల్లె వెలుగు మండల పరిధిలోని గొడిగినూరు గ్రామంలో టిడిపికి చెందిన ప్రముఖ నాయకులు పోలికల లింగారెడ్డి, రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, చిన్న రామిరెడ్డి, ఆకుల నరసింహారెడ్డి, పో రెడ్డి నరసింహారెడ్డి, సురేష్ కుమార్ రెడ్డి తో పాటు మరి కొంతమంది ఆళ్లగడ్డ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి, గొడిగనూరు మాజీ సర్పంచ్, వైసిపి నాయకుడు పత్తి నారాయణ సమక్షంలో బుధవారం వైసిపి కండువా కప్పుకొని ఘనంగా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి తనయుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హయాంలో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ఆళ్లగడ్డ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బ్రిజేంద్ర రెడ్డి నాయకత్వం తమను ఆకర్షించాయని మంచి సంకల్పంతో వైఎస్ఆర్పిపి లో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గంలో వైసిపి అధికారంలో మరెన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు చేపట్టడం జరిగిందన్నారు. వైసిపి రోజు రోజుకు మరింత బలపడుతోందన్నారు. గ్రామాల్లో శాంతియుతంగా అభివృద్ధిని కోరుకునే ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా వైసిపి వైపు అడుగులు వేస్తున్నారని తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత గౌరవంతో పాటు బాధ్యతలు ఉంటాయని హామీలు ఇచ్చి పార్టీ కండువా కప్పి సాధారంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ కన్వీనర్ కుమార్ రెడ్డి, గణేష్ రెడ్డి, మనోహర్ రెడ్డి, రమణ, కొత్తపల్లి మురళి, ముత్యాలపాడు శేషు రమేష్, వివిధ గ్రామాలకు చెందిన ప్రముఖ వైసిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గంగుల కుటుంబ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను విద్యార్థులు మరువ రాదు

ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు12 పల్లె వెలుగు స్వాతంత్ర





సమరయోధుల త్యాగాలను విద్యార్థులు ఎన్నటికీ మరవరాదని ఆళ్లగడ్డ డిఎస్పి శ్రీనివాసరావు సూచించారు బుధవారం నాడు పట్టణంలోని నిర్వహించిన ఇంటింటికి జాతీయ జెండా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ దేశానికి 79 సంవత్సరాల స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పూర్తిచేసుకుని 80 స్వాతంత్ర దినోత్సవ వేడుకలను జరుపుకునేందుకు అందరం సిద్ధమవుతున్నామన్నారు జాతీయ జెండా స్వాతంత్ర పోరాటంలో అందరినీ ఏకతాటిపైకి తెచ్చిందని జాతీయ జెండా మన దేశ సమగ్రత సార్వభౌమ త్వాన్ని ప్రతిబింబం ఈ జాతీయ జెండా దేశం అంటే భిన్నత్వంలో ఏకత్వం కులాలు మతాలు విభజన ఆచార సంప్రదాయాలు ఉన్నాయని మనమంతా భారతీయులమన్నారు స్వాతంత్ర సంబరాల్లో భాగంగా నూరు మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.ప్రైవేట్ స్కూలు యాజమాన్యం పోలీసు రెవెన్యూ శాఖల సమన్వయంతో ఈ ర్యాలీ నిర్వహించామన్నారు. అంతకుముందు స్థానిక సీఐ కార్యాలయం నుండి త్రివర్ణ పతాకంతో భారీ ర్యాలీని డిఎస్పి శ్రీనివాస్ రావు సిఐ నాగరాజారావు ఎస్సైలు పకీరయ్య శ్రీనివాస గౌడ్ రామకృష్ణారెడ్డి తో కలసి ప్రారంభించారు ఈ ర్యాలీ లో విద్యార్థులు భారతమాత వేషధారణలో భారత్ మాతకు జై, జాతీయ గీతాలతో మెయిన్ బజార్ ,పాత బస్టాండ్ టీబీ రోడ్డు మీదుగా నాలుగు రోడ్ల సెంటర్ చేరుకున్న ర్యాలీ ఈ కార్యక్రమంలో అపుష్మ నాయకులు టి అమీర్ భాష కోశాధికారి ,వై చంద్రశేఖర్, ఉపాధ్యాయులు ,విశ్వశాంతి హై స్కూల్, ఐడిఎస్ హై స్కూల్, కే పి జి హై స్కూల్, ప్రజ్ఞ హైస్కూల్ ,రాఘవేంద్ర హై స్కూల్ ,అరుణోదయ, యూపీ స్కూల్ విద్యార్థు పాల్గొన్నారు

--------------------------------

# రేపు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి కర్నూలు పర్యటన, ములాఖా త్‌కు మాత్రమే అనుమతి .

- బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్‌షోలు, ప్రజా సమావేశా లకు అనుమతి లేదు.
- శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి
- 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంది.
- ప్రతిది విడియో , సిసి కెమెరాల నిఘా ను ఏర్పాటు చేశాం.
- ప్రజలకు, ఇతరులకు ఇబ్బంది కలగకుండా పర్యటన పూర్తి చేసుకోవాలి .
- కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్.
- జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియా సమావేశంలో వెల్లడించిన... ఎస్పీ.

పల్లెవెలుగు కర్నూలు క్రైమ్. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఈ నెల 13వ తేదీ గురువారం కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీసు కార్యాల యంలోని వ్యాస్ ఆడిటోరియంలో నిర్వ హించిన మీడియా సమావేశంలో కర్నూ లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ వారు మాట్లాడారు. ఆలూరు ఎమ్మెల్యే ని పరామ ర్శించడానికి వస్తున్నారని పాణ్యం మాజి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి



విన్నవించారన్నారు. ఎంత మంది వస్తారనేది సరైనా సమా చారం తెలియజేయలేదన్నారు. ములాఖత్ కాన్వాయ్ కు మాత్ర మే పోలీసు బందోబస్తు అడిగారని ఆవి ధంగానే పోలీసు భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. కర్నూ లు - ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో దాదాపు 38 కిలోమీటర్లు హైవే కర్నూలు జిల్లా కేంద్రం పంచలింగాల దగ్గర ఉన్న జైలుకు రావడం జరుగు తుందన్నారు. ఎలాంటి సమావే శాలు ,గుంపులు, ర్యాలీలు నిర్వహించరాదన్నారు. హైవే మీద స్కూల్స్, కళాశాలు, హాస్పి టల్స్ ఉన్నాయన్నారు. చుట్టు ప్రక్కల రోడ్డు పై వాహనాదారు లకు, ప్రజలకు ఇబ్బం దులు, కలిగించకూడదన్నారు. అవసర మైన మెడికల్ ఎమర్జన్సీ ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ములాఖాత్‌కు వెళ్లేందుకు మాత్ర మే అనుమతి ఉంద న్నారు. ప్రజలు, రాజకీయ పార్టీ లు, ప్రజాప్ర తినిధులు, కార్యకర్తలు పోలీసుల అనుమతి లేని బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్‌షోలు లేదా పెద్ద సంఖ్యలో ప్రజలు గుమికూ డే కార్యక్రమాలు నిర్వ హించ వద్దని కర్నూలు జిల్లా పోలీసు శాఖ విజ్ఞప్తి చేస్తోందన్నారు. పోలీసు శాఖ విధించిన నిబంధనలను పాటిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజలు, రాజకీయ పార్టీలు, ప్రజాప్రతిని ధులు, కార్యకర్తలు సహక రించాలని ఎస్పీ వారు విజ్ఞప్తి చేశారు. పర్యటన సందర్భంగా పోలీసు శాఖ విధించిన షరతులు లేదా చట్టబద్ధమైన నిబంధ నలను ఎవరైనా ఉల్లంఘించిన ట్లయితే, సంబంధిత చట్టాల ప్రకారం చర్యలుతీసు కుంటామని కర్నూలు జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. ఈ ప్రెస్ మీట్ లో కర్నూలు ఎస్పీ తో పాటు కర్నూలు డిఎస్పీ రాఘవేంద్ర ఉన్నారు.

# కొత్త పింఛన్, రేషన్ కార్డులు మంజూరు చేయాలి

**సీపీఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్**



ప్రతినిధి (తిరుపతి, ఆగస్టు 12, బుధవారం) : కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు తక్షణమే మంజూరు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్ పిలుపునిచ్చారు. మార్పు కోసం చేపడుతున్న సీపీఐ పాదయాత్రలో భాగంగా జీవకోన ప్రాంతంలో బుధవారం పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రలో ప్రజలు అనేక సమస్యలు కమ్యూనిస్టు పార్టీ నాయకులు దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్ మాట్లాడుతూ కూటమి నాయకులు రెండేళ్ల పరిపాలన అభివృద్ధి అనే పేరుతో గొప్పలు చెప్పుకొని ప్రజలను మోసం చేయడం కాదని, రెండు సంవత్సరాలు పూర్తవుతున్నా ఇంతవరకు కొత్తగా పింఛన్లు, రేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. దీంతో వికలాంగులు, వితంతువులు, వృద్ధులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. గత ప్రభుత్వం ఇచ్చిన నివాసానికి ఉపయోగంలేని జగనన్న కాలనీలను రద్దుచేసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్బన్ ప్రాంత వాసులకి రెండు సెంట్లు స్థలం ఇచ్చి నిర్మాణానికి ఐదు లక్షలు మంజూరు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి, రెండున్నరేళ్లు అవుతున్నా తిరుపతి నగరంలో పేదవాడికి ఇప్పటివరకు ఒక ఇంటి స్థలం కూడా మంజూరు చేయలేదని దుయ్యబట్టారు. ఈ జిల్లా ఇన్చార్జి, రెవెన్యూ శాఖ మంత్రిగా ఉన్న తిరుపతి నగర ప్రజలకు ఉపయోగం లేదని, తిరపతి ఇళ్ల సమస్యపై జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రి గారికి తెలియపరిచిన ఉపయోగం లేదని అన్నారు. జీవకోన ప్రాంతంలో గంజాయి మహమ్మారితో యువత చెడు పోతున్నారని, గంజాయి మహమ్మారి వల్ల ప్రజలు భయభ్రాంతులతో బతికే పరిస్థితి ఏర్పడిందని, జీవకోన ప్రాంతంలో నిరంతరం పోలీస్ నిఘా ఏర్పాటు చేసి గంజాయిని అరికట్టాలని కోరారు. రాజకీయ ముసుగులో రౌడీయిజం, భూ కబ్జాలు పెరిగిపోతున్నాయని రెవిన్యూ , పోలీసుల నిర్లక్ష్యం వల్లనే తిరుపతి నగరంలో ఈ తంతు నడుస్తున్నదని తెలపారు. తిరుపతి నగరంలో సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న పాదయాత్రకు మంచి స్పందన వస్తుందని, సమస్యల పరిష్కారం కోసం సిపిఐ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని పిలుపునిచ్చారు. ఈనెల 14వ తేదీన తిరుపతి నగరంలో భారీ ప్రదర్శన చేపట్టడం జరుగుతుందని ఈ ప్రదర్శనకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య హాజరవుతున్నారని ప్రదర్శనలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ పాదయాత్రలో మహిళా సంఘం జిల్లా కార్యదర్శి బి. నదియా, నగర సహాయ కార్యదర్శి బండి చలపతి, నగర కార్యవర్గ సభ్యులు సీ. రత్నమ్మ, ఎన్ మంజుల, శాఖ కార్యదర్శి కాళయ్య, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం. రామకృష్ణ, రామచంద్రయ్య, విజయమ్మ, అలివేలమ్మ, బాబు, రాము, బాదుల్లా, హరిత, ఢిల్లీ బాబు తదితరులు పాల్గొన్నారు.

# 35 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

**ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి**

ప్రతినిధి (నెల్లూరు, ఆగస్టు 12, బుధవారం) : కూటమి ప్రభుత్వం వచ్చిన రెండేళ్ల కాలంలో 732 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 6 కోట్ల 47 లక్షల రూపాయల సాయం అందించడం ఎంతో సంతోషకరమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. బుధవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో



నిర్వహించిన కార్యక్రమంలో 35 మంది బాధితులకు 46 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదల దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఆర్థిక సాయం మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పేదల వైద్య ఖర్చులకు ప్రభుత్వం ఉదారంగా సాయం అందిస్తూ అండగా నిలుస్తుందన్నారు.

## బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో ఉచిత హెచ్ఐవి పరీక్షలు



గొల్లపాలెం, ఆగస్టు 12 పల్లె వెలుగు కాకినాడ జిల్లా కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామంలో బుధవారం బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో స్వచ్ఛంద హెచ్ఐవి టెస్టింగ్ డ్రైవ్ నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థతో పాటు ఇతర స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ శిబిరంలో గ్రామానికి చెందిన ముప్పై తొమ్మిది మంది స్త్రీ పురుషులకు హెచ్ఐవి పరీక్షలు నిర్వహించగా, ఒకరికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. బాధితునికి బీమాబాయి మహిళా మండలి సిబ్బంది తగిన కౌన్సిలింగ్ అందించారు. క్రమం తప్పకుండా ఏఆర్టి మందులు వాడటం ద్వారా సాధారణ, ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని, ఎలాంటి ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు. అదేవిధంగా పరీక్షలు చేయించుకున్న ఇతర ప్రజలకు హెచ్ఐవి బారిన పడకుండా తీసుకోవాల్సిన ముందుజాగ్రత్త చర్యలు, అవగాహన వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, దిశా సిబ్బంది మరియు బీమాబాయి మహిళా మండలి ప్రతినిధులు పాల్గొన్నారు

## యానాంలో వీధికుక్కల బెడద, ఆందోళనలో ప్రజానీకం

యానాం, ఆగస్టు 12 పల్లె వెలుగు రోజురోజుకూ వీధికుక్కల సంఖ్య విపరీతంగా



పెరుగుతుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, కాలనీలు, మార్కెట్ ప్రాంతాలు, పాఠశాలలు, దేవాలయాల పరిసరాల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని కుక్కలు వెంటాడుతుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు ఒంటరిగా వీధుల్లోకి రావడానికి జంకుతున్నారు. పలు ప్రాంతాల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో ఆహారం కోసం కుక్కలు పెద్ద ఎత్తున చేరుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి శాస్త్రీయ పద్ధతుల్లో వీధికుక్కల నియంత్రణ చర్యలు చేపట్టాలని, నిబంధనల ప్రకారం స్టెరిలైజేషన్ పూర్తి చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని యానాం పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు

## ప్రజల అవసరాలే ప్రాధాన్యంగా నగర సమగ్రాభివృద్ధి



రాజమహేంద్రవరం, ఆగస్టు 12 పల్లె వెలుగు నగరంలోని 42 డివిజన్లను ఒక యూనిట్‌గా తీసుకుని ప్రజల అవసరాలే ప్రాధాన్యంగా సమగ్రాభివృద్ధి చేపడుతున్నామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలో సుమారు రూ.300 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టామని వెల్లడించారు. స్థానిక 12వ డివిజన్ గౌతమి స్కూల్ సమీపంలో రూ.29 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు పునర్నిర్మాణ పనులకు ప్రముఖ టీడీపి నాయకుడు కోనేరు మురళితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం డోర్ టు డోర్ కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 12వ డివిజన్‌లో రూ.2.05 కోట్ల విలువైన పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని నగరంలో రూ.140 కోట్లతో డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేయనున్నట్లు ప్రకటించారు. నగరంలో క్రీడా రంగాన్ని ప్రోత్సహించడంతో పాటు రివర్‌ఫ్రంట్, అఖండ గోదావరి ప్రాజెక్టులు, 25 పార్కుల అభివృద్ధి వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. సీసీ కెమెరాలు, లైటింగ్‌తో నగర భద్రతను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని తెలిపారు. ఈ నెలలోనే కొత్త పింఛన్లకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆమోదం తెలపనున్నారని, బూరుగుపూడి పరిసర ప్రాంతాల్లో సుమారు 11,500 మందికి త్వరలోనే ఇళ్ల పట్టాలు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోనేరు మురళి, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో కలెక్టర్, ఎస్పీ సమీక్ష

రాజమహేంద్రవరం, ఆగస్టు 12 పల్లె వెలుగు పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి



ఇబ్బందులు కలగకుండా సమగ్రంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం జిల్లా ఎస్పీ డి నరసింహ కిశోర్ ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ రాజమహేంద్రవరం పరిధిలోని కాతేరు సమీపంలో గల గామన్ బ్రిడ్జి, పేపర్ మిల్ గెస్ట్ హౌస్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపులు, ప్రముఖుల విడిది ఏర్పాట్లు, పార్కింగ్ సదుపాయాలు, భక్తుల రద్దీ నియంత్రణ, అత్యవసర సేవల సమన్వయంపై చర్చించారు. పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, వైద్య సేవలు ముందుగానే సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ డి నరసింహ కిశోర్ మాట్లాడుతూ భక్తుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ వీఐపీ భద్రత, జనసందోహ నియంత్రణ, సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ, అత్యవసర స్పందన బృందాలతో ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా అదనపు ఎస్పీ పాటిల్ డీఎస్పీ వై శ్రీకాంత్ పుష్కర్ డిప్యూటీ కలెక్టర్ మహేష్ సిటీ ప్లానర్ జిఎస్ఎన్ మూర్తి ఇతర అధికారులు పాల్గొన్నారు

## ఇద్దరు విద్యార్థులు ఎన్ ఎం ఎం ఎస్ స్కాలర్షిప్ లకు ఎంపిక

ములకలచెరువు / తంబళ్లపల్లె ఆగస్టు12 పల్లె వెలుగు ప్రతినిధి : తంబళ్లపల్లి మోడల్ స్కూల్ కు





చెందిన విద్యార్థులు ఈ లలిత మరియు పి బెల్నాద్ సాయిలు ఎన్ ఎం ఎస్ పరీక్షలలో తమ ప్రతిభ కనబరిచి అర్హత సాధించడంతో స్కాలర్షిప్లు సాధించినట్లు ప్రిన్సిపాల్ హేమంత్ కుమార్ తెలిపారు. ఇరువురు విద్యార్థులకు ఏడాదికి రూ12వేలు చొప్పున నాలుగు సంవత్సరాలు పాటు స్కాలర్షిప్లు సాధించినట్లు చెప్పారు. లిఖిత, బెల్నాథ్ లను ప్రతిభను ఎంఈఓలు త్యాగరాజు, నాగ సుబ్బరాయుడు లు కొనియాడుతూ వారి కృషికి సహకరించిన ప్రిన్సిపల్ హేమంత్ కుమార్, అధ్యాపకులను ప్రశంసిస్తూ భవిష్యత్తులో ఇదే ఒరవడితో విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com